ఆదివారం
29-09-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 99
పేజీలు : 6+8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సునీతా విలియమ్స్ కోసం నాసా మిషన్

వాషింగ్టన్: అంతరిక్షంలో చిక్కుకున్న వ్యోమగాములు సునీతా విలియమ్స్, బారీ విల్మోర్‌ను సురక్షితంగా భూమిపై తెచ్చేందుకు నాసా ఒక మిషన్ చేపట్టింది. స్పేస్ఎక్స్ క్రూ-9 మిషన్ ఫ్లోరిడాలోని కేప్ కెనావెరల్ స్పేస్ ఫోర్స్‌స్టేషన్ నుంచి స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1.17 (భారత్ సమయం 10.47) గంటలకు నింగిలోకి దూసుకెళ్లింది.
క్రూ మిషన్ కమాండర్‌గా నాసా నిక్ హేగ్, రష్యా రాస్కోస్మోస్ మిషన్ స్పెషలిస్ట్ అలెగ్జాండర్ గోర్బునోవ్ ఉన్నారు. అన్నీ అనుకున్న విధంగా సాగితే 29న సాయంత్రం 5.30 గంటలకు (సోమవారం ఉదయం 3గంటలకు) క్రూ మిషన్... ఐఎస్ఎస్‌తో డాక్ అవుతుంది

మోదీ... సాయమేదీ?

- విపత్తు సంభవించి నెలవుతున్నా స్పందన కరువు
- రికార్డుస్థాయిలో రూ.450 కోట్లు విరాళాలిచ్చిన దాతలు
- కేంద్ర పాలకులు కనికరించని వైనం
- పట్టనట్లు వ్యవహరిస్తున్న రాష్ట్ర బీజేపీ నేతలు
- చంద్రబాబు, పవన్, జగన్ మౌనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వందేళ్ల చరిత్రలో ఎన్నడూలేని ఘోర విపత్తు సంభవించి ఆంధ్రప్రదేశ్ అతలాకుతలమైనా కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు ఎటువంటి ఆర్థిక సహాయం ప్రకటించలేదు. కేంద్రం వైఖరిపై రాష్ట్ర ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. కేంద్రం వైఖరి రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. విపత్తు సంభవించిన తర్వాత ఈనెల మొదటివారంలో కేంద్ర మంత్రి శివరాజ్ చౌహాన్‌తోపాటు కేంద్ర బృందాలు వరద ప్రాంతాలను పరిశీలించి వెళ్లాయి. రాష్ట్రంలో 905 గ్రామాలు, 227 మండలాలు, 16 జిల్లాలపై వరదల ప్రభావం పడింది. రూ.6,880 కోట్లు నష్టం వాటిల్లినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక అంచనా వేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపింది. ఆ తర్వాత అంచనాలు రూ.7,600 కోట్లకు పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం వరద బాధితులకు నష్టపరిహారం కూడా చెల్లించింది. కృష్ణాకు వరద, బుడమేరు ఉప్పొంగి మరో రెండు రోజుల్లో నెల పూర్తవుతుంది. కానీ ఇంతవరకు కేంద్రం నుంచి పైసా కూడా ఆర్థిక సహాయం అందలేదు. ఇటువంటి విపత్తు సమయాల్లో తక్షణ సహాయం ప్రకటించే అవకాశం ఉన్నప్పటికీ... ప్రాథమిక నష్టం అంచనా నివేదిక పంపిన తర్వాత కూడా కేంద్ర పాలకులు ఇంతవరకు స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ పట్ల కేంద్ర ప్రభుత్వం ఇంత కక్షపూరితంగా ఎందుకు వ్యవహరిస్తోందని ప్రజలు మండిపడుతున్నారు. భారత్ భూభాగంలో ఆంధ్రప్రదేశ్ అంతర్భాగం కాదా అని ప్రశ్నిస్తున్నారు. శతాబ్ద కాలంలో ఎన్నడూరాని విధంగా ఈనెల 1,2 తేదీల్లో కృష్ణా నదికి, బుడమేరుకు వచ్చిన భారీ వరద రాష్ట్ర రాజధాని విజయవాడ ప్రాంతాన్ని అతలాకుతలం చేసింది. వందేళ్ల రికార్డును తిరగరాస్తూ 11.43 లక్షల క్యూసెక్కుల నీరు ప్రకాశం బ్యారేజీ నుంచి విడుదలయ్యే పరిస్థితి నెలకొంది. బుడమేరు ఉగ్రరూపానికి విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో దాదాపు 32 డివిజన్లు పూర్తిగా నీట మునిగాయి. రాష్ట్రం మొత్తం మీద 74 మంది మృత్యువాతపడ్డారు. ఒక్క ఎన్టీఆర్ జిల్లా పరిధిలోనే 2.82 లక్షల కుటుంబాలకు చెందిన ఏడు లక్షల మంది ప్రజలు వరద ప్రభావానికి గురయ్యారు. ఆరు అడుగుల నుంచి 10 అడుగుల మేర ఇళ్లు నీటమునగడంతో కట్టుబట్టలతో బాధితులు నిరాశ్రయులయ్యారు. దాదాపు వారం నుంచి పది రోజులు పూర్తిస్థాయిలో ప్రజలు వరదల్లోనే దుర్భర జీవితం గడిపారు. రాష్ట్ర ప్రభుత్వం హెలికాప్టర్లు, బోట్లు, డ్రోన్ల ద్వారా ఆహారం అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోపక్క ఐదు లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు పూర్తిగా నీటమునిగి నాశనమయ్యాయి. 111 చోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. వేలాది కిలోమీటర్ల పొడవునా రోడ్లు ధ్వంసమయ్యాయి. తాగునీటి పైపు లైన్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇక ఇళ్లల్లో అయితే అంచనాలకందనంత నష్టం వాటిల్లింది. అకస్మాత్తు వరదతో ఇంట్లో సామాన్లు మొత్తం వదిలిపెట్టి కట్టుబట్టలతో జనం బయటపడ్డారు. దీంతో ఇంట్లో ఉన్న వస్తువులన్నీ నీట మునిగాయి. టీవీలు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులన్నీ పాడయ్యాయి. కార్లు, ద్విచక్ర వాహనాలు పది రోజులపాటు నీట మునిగి ఉండడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. చివరకు మంచాలు, కుర్చీలు, పరుపులు, పుస్తకాలు, బీరువాలు, గ్యాస్ స్టౌవ్‌లు, ఇతర వంట సామగ్రి వరదకు కొట్టుకుపోయాయి. వందల సంఖ్యలో పశువులు, కోళ్లు, మేకలు, గొర్రెలు చనిపోయాయి. కేంద్ర బృందాలు కూడా వరద బాధితుల దీన పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించింది.బృందం ఎదుట బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. కట్టుబట్టలతో బయటపడ్డ తమను ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. కేంద్ర బృందాలకు సీఎం చంద్రబాబు... ఇది అసాధారణ విపత్తు అని, దీనిని మామూలు విపత్తులా చూడవద్దని కోరుతూ బాధితులను అన్ని విధాలా ఆదుకునేలా సహాయం అందించాలని కోరారు. కేంద్ర మంత్రి శివరాజ్ చౌహాన్ సానుకూలంగా స్పందిస్తూ తాను ఇక్కడి పరిస్థితులను ప్రధాని దృష్టికి తీసుకెళ్లి తక్షణ సహాయం అందేలా చూస్తానని ప్రకటించి వెళ్లారు. కానీ కేంద్రం నుంచి ఆచరణాత్మకంగా ఇంతవరకు ఎటువంటి స్పందనా లేదు. దీంతో కేంద్ర సహాయం కోసం ఎదురుచూసిన రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 25న బాధితులకు దాతలు అందించిన ఆర్థిక సహాయానికి మరికొన్ని నిధులు జోడించి రూ.602 కోట్లు పరిహారం

- మిగతా 2 లో

ముంబైకి ఉగ్ర ముప్పు

నిఘా వర్గాల హెచ్చరిక... భద్రత కట్టుదిట్టం

ముంబై: భారత్‌లో మరో విధ్వంసానికి ఉగ్రవాదులు సిద్ధమైనట్లు తెలుస్తోంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైకి ఉగ్రముప్పు పొంచి ఉన్నట్లు కేంద్ర నిఘా వర్గాలు కేంద్రానికి హెచ్చరికలు జారీ చేశాయి. నిఘా వర్గాలు ఇచ్చిన హెచ్చరికలతో మహారాష్ట్ర పోలీసులు అప్రమత్తమయ్యారు. ముంబైలోని ప్రార్థనా స్థలాలు, రద్దీ ప్రాంతాల్లో ముమ్మరంగా సోదాలు నిర్వహిస్తున్నారు. మాక్ డ్రిల్స్ కూడా నిర్వహిస్తున్నామని పోలీసు అధికారులు తెలిపారు. ముంబై వ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేసినట్లు పేర్కొన్నారు. ఉగ్ర ముప్పు పొంచి ఉందన్న కేంద్ర ఏజెన్సీల సమాచారం మేరకు ముంబై పోలీసులు రద్దీగా ఉండే ప్రాంతాల్లో భద్రతను పెంచారు. నగరం అంతటా మతపరమైన ప్రదేశాలు, రద్దీగా ఉండే బహిరంగ ప్రదేశాల వద్ద భద్రతా చర్యలు కట్టుదిట్టం చేశారు. ముందుజాగ్రత్త చర్యగా ఆయా ప్రాంతాల్లో మాక్ డ్రిల్‌లు నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ)లు తమ తమ జోన్‌లలో భద్రతను నిశితంగా పర్యవేక్షించే పనిలో ఉన్నారు. అయితే దేవాలయాల నిర్వాహకులుప్రత్యేకంగా అప్రమత్తంగా ఉండాలని... ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే తెలియజేయాలని సూచించడం జరిగింది. ముంబైలోని రెండు ప్రసిద్ధ మతపరమైన ప్రదేశాలు ఉన్న క్రాఫోర్డ్ మార్కెట్ ప్రాంతంలో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు. ముంబైలో ఏటా దుర్గాపూజ, దీపావళి పండగలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ సమయంలో ఉగ్రముప్పు హెచ్చరికలు రావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు. అంతే కాకుండా 288 మంది సభ్యులున్న మహారాష్ట్ర రాష్ట్ర అసెంబ్లీకి నవంబర్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో ఉగ్ర ముప్పు హెచ్చరికలు రావడం తీవ్ర కలకలం రేపుతోంది.

సీసీటీవీ నిఘాలో సీబీఎస్ఈ పరీక్షలు

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది నిర్వహించబోయే 10, 12 బోర్డు పరీక్షలు సీసీటీవీ నిఘాలోనే జరపాలని సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) నిర్ణయించింది. ఈ మేరకు అనుబంధ పాఠశాలకు ఆదేశాలు జారీ చేసింది. 2025లో జరగనున్న బోర్డు పరీక్షా కేంద్రాల్లో నిఘా కెమెరాలు తప్పనిసరి చేసినట్లు అందులో పేర్కొంది. 2025లో సీబీఎస్ఈ నిర్వహించే పరీక్షలకు భారత్‌తో పాటు 26 దేశాల్లో కలిపి సుమారు 44 లక్షల మంది హాజరవుతారని బోర్డు అంచనా వేసింది. సుమారు ఎనిమిది వేల పాఠశాలల్ని పరీక్షా

- మిగతా 2 లో

మళ్లీ ఏపీకి లులు

పెట్టుబడులపై ఆసక్తి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో లులు గ్రూప్ ఇంటర్నేషనల్ చైర్మన్ యూసుఫ్ అలీ భేటీ అయ్యారు. శనివారం ఉండవల్లిలోని నివాసంలో దాదాపు రెండు గంటల పాటు ముఖ్యమంత్రితో యూసుఫ్ అలీ చర్చలు జరిపారు. ఆయనతో పాటు వచ్చిన బృందంతో రాష్ట్రంలో పెట్టుబడులపై చంద్రబాబు చర్చించారు. విశాఖలో మాల్, మల్టీప్లెక్స్, విజయవాడ,

- మిగతా 2 లో

కంగన వ్యాఖ్యలపై స్పందించరేం

న్యూఢిల్లీ: చరిత్రాత్మక పోరాటం ద్వారా రద్దు చేయించిన నల్ల సాగు చట్టాలను అమలు చేయాలంటూ ఎంపీ కంగనా రాణావత్ వ్యాఖ్యనించడాన్ని బీకేయూ నేత రాకేశ్ తికైత్ తీవ్రంగా ఖండించారు. ఆమె వ్యాఖ్యలపై బీజేపీ ఎందుకు స్పందించడంలేదని, ఎంపీపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇదే అంశమై ఆయన బీజేపీ అధిష్ఠానానికి లేఖ రాశారు. 'లోక్‌సభ ఎన్నికల్లో హిమాచల్‌ప్రదేశ్‌లోని మండి స్థానంలో దేశ పరిస్థితులపై అవగాహన లేని వ్యక్తిని బరిలోకి

- మిగతా 2 లో

స్వర్ణాంధ్ర సాధనకు కలిసిరండి

సీఎం చంద్రబాబు పిలుపు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్వర్ణాంధ్రప్రదేశ్ కల సాకారం చేసుకోవడం కోసం రాష్ట్ర ప్రజలు కలిసి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకునేందుకు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. 'స్వర్ణాంధ్ర.ఏపీ.జీవోవీ.ఇన్ సజెషన్స్' వెబ్ పోర్టల్‌కు వాటిని పంపాలని సీఎం సూచించారు. మంచి సలహాలు ఇచ్చిన వారికి అభినందన ఈ-పత్రాన్ని అందజేస్తామని చంద్రబాబు తెలిపారు. స్వర్ణాంధ్రప్రదేశ్-2047 దిశగా ప్రయాణం మొదలైంది. దేశంలోనే మెరుగైన వృద్ధిరేటు సాధనే లక్ష్యంగా ముందుకెళుతున్నామంటూ ఆయన ట్వీట్ చేశారు. ప్రజలిచ్చే ప్రతి సూచనను పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. సమష్టిగా స్వర్ణాంధ్రను నిర్మిద్దామని పిలుపునిచ్చారు. 2047 నాటికి భారత్ జీఎస్డీపీ 2.4 ట్రిలియన్ డాలర్లకు చేరుకునేలా తోడ్పడడమే కాకుండా తలసరి ఆదాయాన్ని రూ.36 లక్షలకు పెంచడమే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు.

వైసీపీవి అసత్య ప్రచారాలతో జాగ్రత్త: డిక్లరేషన్‌పై సంతకం చేయడం ఇష్టంలేక తిరుమల పర్యటన రద్దు చేసుకున్న వైసీపీ అధినేత జగన్... కూటమి ప్రభుత్వమేదో తనను అడ్డుకున్నట్లుగా చేసిన అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని చంద్రబాబు అన్నారు. భవిష్యత్ పరిణామాలపై పూర్తి అవగాహనతో ఉండాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని టీడీపీ నేతలకు దిశానిర్దేశం చేశారు. ఎన్టీఆర్ భవన్‌లో అందుబాటులో నేతలతో ఆయన సమావేశమయ్యారు. అనంతపురం జిల్లాలో రాములవారి రథానికి నిప్పు పెట్టిన ఘటనపై విచారణ పూర్తి చేయకుండా రాజకీయ ప్రమేయం లేదని పోలీసులు, అధికారులు అనడాన్ని నేతలు తప్పుపట్టారు. సీఎం వద్ద అసంతృప్తి వ్యక్తంచేశారు. పోలీసులు అత్యుత్సాహంతో ప్రకటనలు ఇవ్వకుండా చూడాలని ఆయనను కోరారు.

నేరుగా సీఎం వద్దకే: ముఖ్యమంత్రికి వచ్చే ప్రజల ఫిర్యాదులపై అధ్యయనం చేసేందుకు సీఎం ముఖ్యకార్యదర్శి ఏవీ రాజమౌళి నేతృత్వ బృందం ఎన్టీఆర్ భవన్‌కు చేరింది. వచ్చే వినతులు ఎలాంటివి... వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి వంటి అంశాలను పరిశీలించారు. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేకి ఫిర్యాదు ఇవ్వకుండా నేరుగా సీఎం వద్దకే ప్రజలు వస్తున్నారంటే తమ సమస్యకు సత్వరమే పరిష్కారమవుతుందనే నమ్మకంతోనే అని, ఆ దిశగా చర్యలు ఉండాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. వచ్చే వినతుల్లో 40శాతం రాజకీయ అంశాలు, నామినేటెడ్ పదవుల దరఖాస్తులు కాగా మిగిలినవి ప్రజా సమస్యలే అని సీఎం కార్యాలయం గుర్తించినట్లు తెలుస్తోంది. ఎక్కువగా రెవెన్యూ అంశాలే ఉన్నందున అవసరమైతే చట్ట సవరణను పరిశీలించాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

కొలికిపూడిపై మీడియా ప్రతినిధులు ఫిర్యాదు

తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాస్‌పై సీఎం చంద్రబాబుకు మీడియా ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. మీడియా ప్రతినిధులందరిని కించపరిచేలా ఎమ్మెల్యే మాట్లాడారని, బెదిరించారని తెలుపుతూ సంబంధిత ఆధారాలను సీఎంకు అందచేశారు. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరారు. తనకు అన్ని విషయాలు తెలుసన్న సీఎం... సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తానని మీడియా ప్రతినిధులకు హామీఇచ్చారు.

నిస్వార్థ కమ్యూనిస్టు బర్ధన్

- నయా ఫాసిస్టు వ్యతిరేక శక్తులను ఏకతాటిపైకి తెచ్చిన ఘనత ఆయనదే
- శత జయంత్యుత్సవ సభలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

నాగపూర్: దేశంలోని అత్యుత్తమ కమ్యూనిస్టు నాయకుడు ఏబీ బర్ధన్ అని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా కొనియాడారు. ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయం ఉన్న ప్రాంతంగానే కాదు బర్ధన్‌కు కర్మభూమిగానూ నాగపూర్ ప్రాచుర్యం పొందిందన్నారు. విద్యార్థి దశ నుంచి తుది వరకు కమ్యూనిజం వ్యాప్తి కోసం, వామపక్షాలు, కార్మిక వర్గాల ఐక్యత కోసం బర్ధన్ పాటుపడ్డారని చెప్పారు. బర్ధన్ శతజయంతుత్సవాన్ని ఆయనకు కర్మభూమిగా వ్యవహరించే నాగపూర్‌లో నిర్వహించడంపై హర్షం వ్యక్తంచేశారు. శతజయంత్యుత్సవం పురస్కరించుకొని స్థానిక పర్వానా స్మారక భవన్‌లో నిర్వహించిన సభకు సీపీఐ జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు, సానుభూతిపరులు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. దీంతో సభా ప్రాంగణం కిక్కిరిసింది.శతజయంత్యుత్సవం సందర్భంగా బర్ధన్‌కు ఘనంగా నివాళులర్పించారు. రాజా అధ్యక్షతన సభ జరిగింది. ప్రారంభోపన్యాసాన్ని ప్రముఖ ఆర్థికవేత్త, మార్క్సిస్టు మేధావి, ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ చేశారు. 'నయా ఉదారవాదం శకంలో శ్రామిక వర్గానికి సవాళ్లు' అనే అంశంపై దాదాపు గంటసేపు ప్రసంగించారు. తొలుత రాజా మాట్లాడుతూ సీపీఐ ప్రధాన కార్యదర్శిగా, అత్యుత్తమ కమ్యూనిస్టు నాయకుడిగా బర్ధన్ నిస్వార్థ సేవలు అందించారని శ్లాఘించారు. ఆయనను స్ఫూర్తిప్రదాతగా కొనియాడారు. కమ్యూనిజం వ్యాప్తికి బర్ధన్ తుది వరకు పనిచేశారన్నారు. 'నాగపూర్ ధమ్మ విప్లవ గడ్డ. బర్ధన్‌కు కర్మభూమి' అని రాజా అన్నారు. విద్యార్థి దశ నుంచే బర్ధన్ ప్రజల మధ్య తిరిగారని, ప్రజా నాయకుడిగా ఎదిగారని, పార్టీలో కీలకంగా వ్యవహరించారని తెలిపారు. అసెంబ్లీలో అడుగు పెట్టిన పిన్న వయస్కుడిగా నిలిచారన్నారు. వామపక్ష

- మిగతా 2 లో

ఇదీ లోకం!

మళ్ళీ చెబుతున్నా, గాంధీగారి సాక్షిగా మా ప్రభుత్వం సంపూర్ణ మద్యనిషేధానికి కట్టుబడిఉంది!

చిరంజీవికి మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం

అబుదాబిలో ఘనంగా ఐఐఎఫ్ఏ అవార్డ్స్ - 2024 వేడుక

న్యూఢిల్లీ: మెగాస్టార్ చిరంజీవికి తాజాగా మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం దక్కింది. అబుదాబిలో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ (ఐఐఎఫ్ఏ) అవార్డ్స్ 2024 వేడుకల్లో చిరు 'ఔట్ స్టాండింగ్ అచీవ్ మెంట్ ఇన్ ఇండియన్ సినిమా' పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో

- మిగతా 2 లో

ఇంతటితో ఆపేయండి

లడ్డూ వివాదంపై చంద్రబాబుకు రామకృష్ణ హితవు

విశాలాంధ్ర-ఆలూరు: తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ వివాదానికి స్వస్తి పలకాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు ప్రభుత్వ పెద్దలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సూచించారు. దోషులు ఎంతటివారైనా...క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా, ఆలూరులోని రోడ్లు భవనాల అతిథి గృహంలో రామకృష్ణ శనివారం విలేకరులతో మాట్లాడుతూ రాజకీయాలను దేవుడికి అంటగట్టకూడదన్నారు. లడ్డూ వివాదాన్ని ఇంతటితో ఆపాలని హితవు పలికారు. లడ్డూ కల్తీపై సిట్ దర్యాప్తునకు సీఎం ఆదేశించారని, ముగ్గురు సీనియర్ ఐపీఎస్‌లతో కమిటీ వేశారని గుర్తుచేశారు. దర్యాప్తు నివేదిక ఆధారంగా పాత్రధారులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా చూడాలని, లడ్డూపై రాజకీయాలు తగవని అన్నారు. కులమతాలను రెచ్చగొట్టే పద్ధతి సరికాదని, మత అజెండాతో రాజకీయాలు చేయొద్దని రామకృష్ణ హితవు పలికారు. ఆలయాలను కేంద్రం తన పరిధిలోకి తీసుకో వాలని భావిస్తే ఏం సమాధానం చెబుతారంటూ చంద్రబాబును ప్రశ్నించారు. ఇలాంటి పరిస్థితుల దృష్ట్యా ఈ వివాదాన్ని ఇంతటితో ఆపేయడం మంచిదని ముఖ్యమంత్రికి రామకృష్ణ సూచించారు. సమావేశంలో చేతివృత్తుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, మండల కార్యదర్శి రామాంజనేయులు, ఏఐటీయూసీ నేత బాషా, రైతు సంఘం మండల కార్యదర్శి రంగన్న పాల్గొన్నారు.



హసన్ నస్రల్లా హతం

బీరుట్‌లో ఇజ్రాయిల్ భీకర దాడులు

పశ్చిమాసియా రగిలిపోతోంది. ఇజ్రాయిల్ సాయుధ దళాలు (ఐడీఎఫ్) శనివారం లెబనాన్ రాజధాని బీరుట్‌పై బాంబుల వర్షం కురిపించాయి. ఈ దాడుల్లో హెజ్బొల్లా అధినేత హసన్ నస్రల్లా హతమయ్యారు.

2లో

హసన్ నస్రల్లా హతం

బీరుట్‌లో ఇజ్రాయిల్ భీకర దాడులు | ప్రతిఘటన ఆగదు: హెజ్బుల్లా

బీరుట్/టెల్అవీవ్: పశ్చిమాసియా రగిలిపోతోంది. ఇజ్రాయిల్ సాయుధ దళాలు (ఐడీఎఫ్) శనివారం లెబనాన్ రాజధాని బీరుట్‌పై బాంబుల వర్షం కురిపించాయి. ఈ దాడుల్లో హెజ్బుల్లా అధినేత హసన్ నస్రల్లా హతమయ్యారు. మూడు దశాబ్దాల పాటు హెజ్బుల్లాకు నాయకత్వం వహించిన నస్రల్లాను చంపేశామంటూ ఐడీఎఫ్ ప్రకటించింది. హెజ్బుల్లా సదరన్ ఫ్రంట్ సీనియర్ కమాండర్ అలీ కర్ కరాకీ, మరికొందరు కమాండర్లను మట్టుబెట్టినట్లు వెల్లడించింది హెజ్బుల్లా కేంద్ర కార్యాలయం లక్ష్యంగా జరిపిన దాడుల్లో ఆ సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు పేర్కొంది. నస్రల్లా మరణాన్ని హెజ్బుల్లా ధ్రువీకరించింది. సంతాపాన్ని ప్రకటించింది. ఆయన అమరులయ్యారని, పలస్తీనాకు మద్దతుగా శత్రువులతో యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన ఆయనకు అమరత్వం సిద్ధించిందని ఒక ప్రకటన చేసింది. కాగా, నిర్వాసిత భవనాల్లో ఆయుధాలను హెజ్బుల్లా నిల్వ ఉంచినట్లు ఆరోపిస్తూ బీరుట్‌లో ఇజ్రాయిల్ దాడులు చేస్తోంది. దహియే జిల్లాలపై దాదాపు గంటకుపైగా ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు బాంబుల వర్షం కురిపించాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. తీరం నుంచి సముద్రంలోకి ప్రయోగించే ఇరాన్ తయారీ క్షిపణలతో పాటు అనేక ఆయుధాలను ఆయా చోట్లలో హెజ్బుల్లా ఉంచినట్లు ఇజ్రాయిల్ సైన్యం పేర్కొంది. తాజా దాడుల్లో ఆరుగురు పౌరులు చనిపోగా దాదాపు 100 మందికి గాయాలైనట్లు స్థానిక మీడియా తెలిపింది. 'హసన్ నస్రుల్లా ఇకపై ప్రపంచాన్ని భయపెట్టలేరు' అంటూ ఐడీఎఫ్ ఓ పోస్టు పెట్టింది. సోమవారం నుంచి ఇజ్రాయిల్ జరుపుతున్న దాడుల్లో ఇప్పటికే 720 మంది మరణించినట్లు లెబనాన్ ఆరోగ్యశాఖ వెల్లడించింది. మృతుల్లో పిల్లలే అధికమని తెలిపింది. ఆసుపత్రిపై దాడిలో వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది మొత్తం 11 మంది ప్రాణాలు కోల్పోగా మరో 10 మందికి గాయాలైనట్లు వెల్లడించింది. కాగా, నస్రల్లా హత్యను రష్యా, పలస్తీనా ఖండించాయి. ఇరాన్, దాని అనుబంధ వర్గాల రక్షణకు కట్టుబడి ఉన్నట్లు అమెరికా రక్షణ శాఖ ఒక ప్రకటన చేసింది.

హాషెం సఫీయిద్దీన్‌కు పగ్గాలు?

హెజ్బుల్లా తదుపరి నాయకుడిగా నస్రల్లాకు సోదర వరుసయ్యే హాషెం సఫీయిద్దీన్ పగ్గాలు చేపట్టవచ్చని తెలుస్తోంది. పలస్తీనాకు సఫీయిద్దీన్ అనుకూలం. ఇజ్రాయిల్‌పై పోరు ఉధృతం చేసేందుకు కట్టుబడి ఉన్నారు. ఇటీవల హెచ్చరికలు కూడా చేశారు. ఏడ్చీ గీపెట్టేందుకు శత్రువుని సిద్ధం కానివ్వండి అంటూ ఆయన ఇజ్రాయిల్‌నుద్దేశించి బహిరంగంగా వ్యాఖ్యానించారు. ఆయనకు రాజకీయంగానే కాకుండా తీవ్రవాద వర్గాల్లోనూ గుర్తింపు ఉండటంతో హెజ్బుల్లాకు తదుపరి అధినేతగా బాధ్యతలు చేపట్టేందుకు అవకాశాలున్నాయి.

నిర్వాసితులు రెట్టింపు: ఐరాస

ఘర్షణ కారణంగా నిర్వాసితులైన వారి సంఖ్య రెట్టింపు అయిందని ఐక్యరాజ్యసమితి (ఐరాస) తెలిపింది. ప్రస్తుతం 2,11,000 మందికిపైగా నిరాశ్రయులయ్యారని పేర్కొంది. లెబనాన్‌లోని తీవ్ర ప్రభావిత ప్రాంతాల్లో 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మూతబడినట్లు ఐక్యరాజ్యసమితి మానవతా వ్యవహారాల సమన్వయ కార్యాలయం తెలిపింది.

ఇది అంతం కాదు: ఇజ్రాయిల్ సైన్యాధికారి

ఇజ్రాయిల్ వైపు కన్నెత్తి చూస్తే నస్రల్లాకు పట్టిన గతే పడుతుందని ఇజ్రాయిల్ సైన్యాధికారి హెచ్చరించారు. 'ఇది అంతం కాదు... హెజ్బుల్లాకు ముందున్నది మొసళ్ల పండుగ' అని వ్యాఖ్యానించారు. ఇజ్రాయిల్‌ను భయపెట్టాలనుకుంటే మా అమ్ములపొది నుంచి మరిన్ని అస్త్రాలు బయటకు వస్తాయని గుర్తుపెట్టుకోండని లెఫ్టినెంట్ జనరల్ హెర్జి హవేలీ ఒక ప్రకటన చేశారు. అంతకుముందు ఐరాస వేదికగా ఈ పోరాటంలో గెలుపు తమదే అంటూ ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించుకున్నారు. లెబనాన్‌పై దాడుల క్రమంలో అమెరికా పర్యటనను అర్థాంతంగా ముగించుకొని స్వదేశానికి చేరుకొని పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నారని అధికారులు తెలిపారు.

సీసీటీవీ నిఘాలో సీబీఎస్‌ఈ పరీక్షలు

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రాలుగా ఎంపిక చేసింది. వాటిలో సీసీటీవీ నిఘాని తప్పనిసరి చేస్తూ ఆయా పాఠశాలలకు తాజాగా ఆదేశాలు జారీ చేసింది. సీసీటీవీ సౌకర్యం లేని ఏ పాఠశాలను పరీక్షా కేంద్రంగా పరిగణించేది లేదని అందులో స్పష్టంచేసింది. రికార్డ్ ఫుటేజీ సంబంధిత అధికారులు మాత్రమే చూసేందుకు వీలుంటుందని పరీక్షా ఫలితాలు వచ్చిన రెండు నెలల వరకు ఈ ఫుటేజీ భద్రంగా ఉంటుందని పేర్కొంది. ప్రతీ పది గదులకు లేదా 240 మంది విద్యార్థుల బాధ్యత తీసుకొనేందుకు ప్రత్యేకంగా ఓ వ్యక్తిని నియమిస్తున్నట్లు తెలిపింది. కొత్తగా తీసుకొచ్చిన సీసీటీవీ విధానం ద్వారా పారదర్శకత, పర్యవేక్షణ సామర్థ్యాలు పెరుగుతాయని సీబీఎస్ఈ భావిస్తోంది. వీటి సాయంతో ఎటువంటి ఆటంకం లేకుండా పరీక్షలు సజావుగా నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

నేపాల్ వరదలకు 59 మంది మృతి

ఖాట్మండు: నేపాల్‌లో వరదలు బీభత్సం సృష్టించాయి. కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ఎనిమిది జిల్లాల్లో దాదాపు 59 మంది మరణించారు. 11మంది గల్లంతైనట్లు అధికారులు తెలిపారు. ఆకస్మిక వరదలు పోటెత్తడంతో దేశంలోని అనేక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. జనజీవనం స్తంభించింది. ఈ వరదలు మరింత తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని విపత్తు ప్రతిస్పందన అధికారులు హెచ్చరించారు. వరదలు పోటెత్తుతుండటంతో ఖాట్మండులో 9 మంది, లలిత్‌పూర్‌లో 16 మంది, భక్తపూర్‌లో ఐదుగురు, కవ్రేపాలన్‌చౌక్‌లో ముగ్గురు, పంచతార్, ధన్‌కూటాలో ఇద్దరు, ఝాపా, ధాడింగ్‌లో ఒక్కొక్కరు చొప్పున మరణించినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. 226 ఇళ్లు పూర్తిగా నీటమునిగాయని, బాధిత ప్రాంతాల్లో దాదాపు 3 వేల మంది భద్రతా సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నట్లు అధికారులు వెల్లడించారు. నేపాల్ సాయుధ పోలీసు దళానికి చెందిన 1,947 మంది భద్రతా సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్నారు. వరద ప్రభావ ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి 23 రాఫ్టింగ్ బోట్లు సిద్ధం చేశారు. ఇప్పటి వరకు 760 మందిని రక్షించినట్లుగా వెల్లడించారు.

సురక్షిత ప్రాంతానికి ఖమేనీ

టెహ్రాన్: ఇజ్రాయిల్ దాడుల్లో హెజ్బుల్లా అధినేత హసన్ నస్రల్లా చనిపోయిన క్రమంలో ఇరాన్ అప్రమత్తమైంది. తమ అధినేత ఆయతుల్లా అలీ ఖమేనీని సురక్షిత ప్రాంతానికి తరలించింది. ఖమేనీ భద్రతను మరింత పెంచింది. హెజ్బుల్లాతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు ఇరాన్ వర్గాలు తెలిపాయి. తదుపరి కార్యాచరణపై టెహ్రాన్, దాని ప్రాంతీయ భాగస్వాములు తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం. అంతకుముందు ఖమేనీ ఒక ప్రకటనలో లెబనాన్ ప్రజలకు, హెజ్బుల్లాకు సంపూర్ణ మద్దతు తెలిపారు. లెబనాన్‌కు అండగా నిలవాలని ప్రపంచ ముస్లింలకు పిలుపునిచ్చారు. 'హెజ్బుల్లా అధినేత హసన్ నస్రల్లాను ఇజ్రాయిల్ చంపేసింది. ప్రతిఘటన శక్తులపై ఈ ప్రాంత భవిష్యత్ ఆధారపడి ఉంది. హెజ్బుల్లా అగ్రభాగాన ఉండి పోరాడుతోంది' అని ఖమేనీ పేర్కొన్నారు. లెబనాన్‌పై దాడుల క్రమంలో ఇజ్రాయిల్ విధానాన్ని తీవ్రంగా ఖండించారు. ఇజ్రాయిల్‌కు దూరదృష్టి లేదని దుయ్యబట్టారు. నిరాయుధులు, అమాయకులను పొట్టన పెట్టుకుంటూ అరాచకం సృష్టిస్తోందని ఖమేనీ ఆగ్రహం వ్యక్తంచేశారు.

అమెరికాలో హరికేన్ బీభత్సం

- 4 రాష్ట్రాల్లో 45 మంది మృతి
- తీవ్రమైన గాలులకు వణికిన ఫ్లోరిడా
- అట్లాంటాను ముంచెత్తిన వర్షం
- కుప్పకూలిన ఇళ్లు, చెట్లు
- 25 బిలియన్ డాలర్ల ఆస్తి నష్టం

వాషింగ్టన్: అమెరికాలో హరికేన్ హెలెనా విధ్వంసం సృష్టిస్తోంది... పెనుగాలులకు ఫ్లోరిడా రాష్ట్రం చిగురుటాకుల వణికింది. ఎటుచూసినా విరిగిపడిన చెట్లు, కుప్పకూలిన ఇళ్లు, వరద నీటితో పరిస్థితి భయానకంగా మారింది. కుండపోత వర్షాలకు నాలుగు రాష్ట్రాల్లో వరదలు ముంచెత్తాయి. ఇళ్లు, ఆఫీసులు, ఆసుపత్రులు నీట మునిగాయి. విద్యుత్ సరఫరా లేక చాలా ప్రాంతాలు అంధకారంలో మునిగిపోయాయి. ఫ్లోరిడాతో పాటు జార్జియా, నార్త్, సౌత్ కరోలినా రాష్ట్రాల్లో హెలెనా ప్రభావం తీవ్రంగా ఉందని అధికారులు తెలిపారు. వర్జీనియా రాష్ట్రంలోనూ హెలెనా బీభత్సం సృష్టిస్తోంది. జార్జియాలోని ఓ ఆసుపత్రి నీట మునగడంతో పేషెంట్లు, సిబ్బంది బంగ్లా పైకెక్కి సాయం కోసం కేకలు పెట్టారు. బాధితులను కాపాడేందుకు రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు హెలికాప్టర్ సాయంతో మొత్తం 54 మందిని కాపాడారు. నాలుగు రాష్ట్రాల్లో హెలెనా సృష్టించిన విధ్వంసానికి ఇప్పటి వరకు 45 మంది చనిపోయారు. రెస్క్యూ పనుల్లో నిమగ్నమైన ఫైర్ డిపార్ట్ మెంట్ సిబ్బంది ముగ్గురు కూడా చనిపోయారు. టెనెస్సీ లో 7 వేల మందిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఫ్లోరిడాలో హరికేన్ తీరం దాటే సమయంలో గంటకు 225 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడంతో తీర ప్రాంతంలోని ఇళ్లు నేలమట్టమయ్యాయి. నాలుగు రోజుల క్రితం ఇళ్లు ఉన్నచోట ప్రస్తుతం శిథిలాల కుప్పలు కనిపిస్తున్నాయి. తీవ్రత ఎక్కువగా ఉండడంతో అధికారులు హెలెనా హరికేన్ ను కేటగిరి 4 గా ప్రకటించారు. ఐదు రాష్ట్రాల్లో సుమారు 25 బిలియన్ డాలర్ల ఆస్తి నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. అట్లాంటాలో 1886 లో 24.36 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా.. హెలెనా ప్రభావంతో 48 గంటల్లో 28.24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని వివరించారు. నార్త్ కరోలినాలో వరదల్లో చిక్కుకున్న వంద మందిని రెస్క్యూ టీమ్ లు కాపాడాయి. వరదల్లో ఇంటి ముందు పార్క్ చేసిన వాహనాలతో పాటు ఇంట్లోని వస్తువులు కూడా కొట్టుకుపోయాయి. పలుచోట్ల గ్యాస్ సిలిండర్లు కొట్టుకుపోతుండడం చూశామని వరద బాధితులు చెప్పారు. తలహాస్సీలోని ఓ స్కూలులో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో 175 మంది ఆశ్రయం పొందుతున్నారు. హరికేన్ కారణంగా స్కూళ్లు, ఆఫీసులు, యూనివర్సిటీలు మూతపడ్డాయి. కాగా, హరికేన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రాణనష్టం తగ్గించేందుకు రెస్క్యూ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయని అమెరికా ప్రెసిడెంట్ జో బైడెన్ చెప్పారు.

వరదల్లో చిక్కుకున్న వారిని కాపాడడంతో పాటు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు వివరించారు. హెలెనా హరికేన్ ను అంతరిక్ష కేంద్రం నుంచి చిత్రీకరించిన వీడియోను నాసా ట్వీట్ చేసింది.

మోదీ... సాయమేదీ?

(మొదటిపేజీ తరువాయి)

అందజేసింది. పూర్తిగా నీటమునిగిన ఇళ్లకు రూ.25వేలు, మొదటి అంతస్తులో ఉండేవారికి రూ.10 వేలు, ద్విచక్ర వాహనదారులకు రూ.3 వేలు, ఆటోలకు రూ.10 వేలు అందజేసింది. ఏపీకి సంభవించిన విపత్తుకు స్పందించి రాష్ట్రంలోని పారిశ్రామిక వేత్తలు, వివిధ వర్గాల ప్రజలు తమ స్థోమతకు తగ్గట్లు విరాళాలు అందజేశారు. ఈ విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపు రూ.450 కోట్లు సమకూరాయి. విపత్తు పట్ల ప్రజా స్పందన అద్భుతంగా ఉన్నప్పటికీ దిల్లీ పెద్దలు మాత్రం చలించడం లేదు.

కేంద్రం వైఖరిపై అధికార, ప్రతిపక్ష నేతల మౌనం

కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంపై సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ నేతలు, చివరకు ప్రతిపక్ష నేత జగన్‌మోహన్ రెడ్డి సైతం నోరు విప్పకపోవడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇంత ఘోర విపత్తు జరిగినా కేంద్రం ఎందుకు ఆర్థిక సహాయం అందించడం లేదు? కేంద్ర ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న కూటమి పక్ష నేతలు ఎందుకు మాట్లాడడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

తిరుపతి లడ్డూ కల్తీపై స్పందించినంత తీవ్రస్థాయిలో బాధితులకు నష్టపరిహారం అంశంలో కేంద్రంపై ఎందుకు ఒత్తిడి పెంచలేకపోతున్నారని నిలదీస్తున్నారు. లడ్డూ కల్తీపై చంద్రబాబు వ్యాఖ్యలను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ... కేంద్ర సహాయంపై నోరు మెదపకపోవడం గమనార్హం. రాష్ట్ర బీజేపీ నేతలైతే ఇది తమకు సంబంధించిన వ్యవహారం కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. గతంలో విభజన చట్టం అమలు విషయంలో ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరించారో... ఇప్పుడు విపత్తుకు అందాల్సిన కేంద్ర ఆర్థిక సహాయం విషయంలోనూ అదే తీరు కనబరుస్తున్నారు.

చిరంజీవికి మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం

(మొదటిపేజీ తరువాయి)

తెలుగు హీరోలు వెంకటేశ్, బాలకృష్ణ, యువ హీరోలు దగ్గుపాటి రాణా, సుశాంత్, ఇతర నటీనటులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెగాస్టార్‌ను రాణా, బాలకృష్ణ అభినందించారు. అలాగే బాలయ్యకు 'గోల్డెన్ లెగసీ' అవార్డు దక్కింది. ఇక హీరోయిన్ సమంత 'ఉమెన్ ఆఫ్ ది ఇయర్' అవార్డు గెలుచుకున్నారు. హీరో నానికి ఉత్తమ నటుడు (దసరా) అవార్డు దక్కగా, 'మిస్‌శెట్టి మిస్టర్ పోలిశెట్టి' చిత్రానికి ఉత్తమ సినిమాటోగ్రఫీ పురస్కారం వరించింది. ఇక ఇటీవలే చిరంజీవి ప్రతిష్ఠాత్మక గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న విషయం తెలిసిందే. 46 ఏళ్ల తన సినీ జీవితంలో 156 చిత్రాలు, 537 పాటలు, 24వేల డ్యాన్స్ స్టెప్పులతో ప్రేక్షకులను అలరించినందుకు చిరు ఈ రికార్డు దక్కించుకున్నారు. ఇప్పుడు ఐఐఎఫ్ఏ అవార్డ్స్ 2024లో మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం దక్కించుకోవడంతో మెగా అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిస్వార్థ కమ్యూనిస్టు బర్ధన్

(మొదటిపేజీ తరువాయి)

కార్మిక సంఘాలు, ఇతర ప్రజా సంఘాల ఐక్యతకు బర్ధన్ గణనీయమైన తోడ్పాటు అందించారని శ్లాఘించారు. నయా ఫాసిస్టు వ్యతిరేక శక్తులను ఏకతాటిపైకి తేవడంతో ఏబీ బర్ధన్ పాత్ర కీలకమంటూ రాజా తన ప్రసంగాన్ని ముగించారు.

నయా ఫాసిస్టులతో ముప్పు: ప్రొఫెసర్ పట్నాయక్

ప్రొఫెసర్ పట్నాయక్ దాదాపు ఒక గంట పాటు ప్రసంగించారు. రాజకీయాలల్లో నయా ఫాసిస్టులు పెరిగిపోయారని, ఇది మాంద్యానికి దారితీస్తుందన్నారు. భారత్ మొదలు యూరప్, అమెరికాలోనూ అధికారం కోసం పెట్టుబడిదారీ వర్గంపై నయా ఫాసిస్టులు ఆధారపడుతుండటంతో రాజకీయ ముఖచిత్రం మారిందని వ్యాఖ్యానించారు. దీని ప్రభావం ముందుగా బ్రిటన్, జపాన్ దేశాలపై పడిందని తెలిపారు. బ్రిటన్‌లో ఫాసిస్టు గూండాలకు, శ్రామిక వర్గానికి మధ్య వీధి పోరు సాగిందన్నారు. నయా ఫాసిస్టుల్లో ప్రధానంగా ఐదు లక్షణాలు ఉంటాయని చెప్పారు. గుత్తాధిపత్యం కలిగివున్న పెట్టిబడిదారుతో వీరికి దగ్గర సంబంధాలు ఉంటాయని, నిరంకుశత్వం, అణచివేత ధోరణి వీరి సొంతమని ప్రొఫెసర్ పట్నాయక్ తెలిపారు. భారత్‌లో ఈడీ, సీబీఐ దుర్వినియోగాన్ని ఉదహరించారు. వీధిగూండాల విస్తృత వినియోగానికి భారత్, ఫ్రాన్స్ మంచి ఉదాహరణలన్నారు. మైనారిటీని బూచీగా చూపి లబ్ధి పొందుతారని... అమెరికా, జర్మనీ దేశాల్లో శరణార్థులు, భారత్‌లో ముస్లింలు ఇందుకు బలవుతున్నారన్నారు. నయా ఫాసిస్టులకు వ్యక్తి ఆరాధనంటే ఇష్టమని, హిట్లర్ ఇదే చేశారని, ఆసియాతో పాటు ఇతర దేశాల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉందని ప్రొఫెసర్ పట్నాయక్ అన్నారు. 1968-2011లో జీవన ప్రమాణాలపై అమెరికాలో జోసెఫ్ స్టిగ్లిట్జ్ నిర్వహించిన అధ్యయనంలో విస్తుపోయే విషయాలు తెలిశాయని చెప్పారు. 2011లో అమెరికాలో సగటు కార్మికుడికి లభించే జీతం... 1968లో ధరల కంటే తక్కువగా ఉన్నట్లు వెల్లడైందన్నారు. శ్రామిక వర్గానికి, కార్పొరేట్ ఆదాయానికి మధ్య వ్యత్యాసానికి ఇదే ప్రధాన కారణమని చెప్పారు. నిరుద్యోగం, ప్రైవేటీకరణ, నయా ఫాసిస్టు విధానాలు, గుత్తాధిపత్యం, ఈడీ, సీబీఐ దుర్వినియోగం, నిరంకుశత్వం, గూండాగిరీ, మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవడం వంటి అంశాల గురించి ప్రొఫెసర్ పట్నాయక్ మాట్లాడారు. అమెరికా, జర్మనీలో శరణార్థులు లక్ష్యంగా మారుతుంటే, భారత్‌లో ముస్లింల నెత్తిన ఎప్పుడూ కత్తి వేలాడుతోందని చెప్పారు. పర్సనాలిటీ కల్ట్ (వ్యక్తి ఆరాధన)కు ఆసియా కేరాఫ్‌గా మారిందన్నారు. శ్రామిక వర్గం బలహీనత... నయా ఫాసిస్టులకు బలమని నొక్కిచెప్పారు. నయా ఫాసిజాన్ని ఎదిరించడం శ్రామిక వర్గానికి కీలకమన్నారు. ఆహారం, ఉద్యోగం, ఉచిత విద్య, వైద్యం, వృద్ధాప్య పింఛన్ వంటి హక్కుల కోసం శ్రామిక వర్గం డిమాండ్ చేయాలని ప్రొఫెసర్ పట్నాయక్ పిలుపునిచ్చారు. గౌరవంగా జీవించే హక్కు కోసం శ్రామిక వర్గం పోరాడుతోందని ప్రజలకు తెలియడం అవసరమని సూచిస్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

అంతకుముందు సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ప్రొఫెసర్ పట్నాయక్‌ను సీపీఐ నాగపూర్ జిల్లా సమితి సత్కరించింది. సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులందరికీ మెమొంటోలు అందజేసింది. ఇదిలావుంటే సభకు సీపీఐ కార్యదర్శి డాక్టర్ బాల్‌చంద్ర కాంగో స్వాగతం పలికారు. బర్ధన్ జీవితం, ఉద్యమాలు, విజయాల గురించి కొన్ని విషయాలు తెలిపారు. రాజకీయ ప్రత్యర్థులతో పాటు సమాజంలోని అన్ని వర్గాల ఆదరణ, గౌరవాన్ని బర్ధన్ పొందారని కాంగో అన్నారు. సీపీఐ మహారాష్ట్ర రాష్ట్ర సమితి కార్యదర్శి సుభాష్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి తోడ్పడిన వారిలో మోహన్ శర్మ, శ్యామ్ కాలే, అరుణ్ వాంకర్, డాక్టర్ యుగల్ రాయులు, గంజనన్ ఘోడె, కరుణ శాక్రే, సంజయ్ రౌత్, రవీంద్ర పరాటే, జయశ్రీ చహాండె, ప్రగతి ఖపార్డే, ప్రీతి రాహుల్కర్, సునీల్ షెండె, ప్రేమ్ జోగి, శహిలేశ్ ఖోబ్రగడే, మౌర్య, బీఎస్‌జే శర్మ, సీజే జోసెఫ్ తదితరులు ఉన్నారు.

గుర్రం జాషువాకు ప్రముఖుల ఘననివాళి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: పద్మభూషణ్ గుర్రం జాషువా జయంతిని టీడీపీ, వైసీపీ కేంద్ర కార్యాలయాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కులవివక్షను రూపుమాపేందుకు కృషి చేసిన జాషువా రచనలను గుర్తుచేసుకున్నారు. గబ్బిలం, కొత్తలోకం వంటి గొప్పగొప్ప రచనలతో మానవుల్లో మలినాలను తొలగించేందుకు ఆయన కృషి చేశారన్నారు. కవితా విశారద, కవికోకిల, కవిదిగ్గజ, నవయుగ కవిచక్రవర్తి, మధుర శ్రీనాథ, విశ్వకవి సామ్రాట్‌గా ప్రసిద్ధుడయ్యాడై ఎన్నో బిరుదుల అందుకున్నారన్నారు. ఆయా పార్టీల కార్యాలయాల్లో సీఎం చంద్రబాబు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్ధన్, మంత్రులు వంగలపూడి అనిత, డోలా బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు, జంగా కృష్ణమూర్తి, మాజీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర కుమార్, ఏపీ వినియోగదారుల కౌన్సిల్ చైర్మన్ పీతల సూజాత, జాతీయ అధికార ప్రతినిధి పట్టాభిరామ్, మీడియా కోఆర్డినేటర్ ధారపనేని నరేంద్రబాబు, వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి, కొమ్మూరి కనకారావు, అడపా శేషు పాల్గొన్నారు.

కంగన వ్యాఖ్యలపై స్పందించరేం

(మొదటిపేజీ తరువాయి)

దింపారనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఎంపీ కంగన వ్యవసాయ సమాజాన్ని పదేపదే లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఆమె తీరు గ్రామస్థులను అవమానించేలా ఉంది' అని లేఖలో తికాయత్ పేర్కొన్నారు. 2014లోనే భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చిందని ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రస్తావించారు. పోరాటయోధులు, విప్లవకారులను అవమానించేలా ప్రవర్తిస్తున్నారని, రద్దు చేసిన వ్యవసాయ చట్టాలను తిరిగి తీసుకురావాలనుకోవడం ఆమోదయోగ్యం కాదన్నారు.

బుచ్చమ్మ ఆత్మహత్యకు... హైడ్రాకు సంబంధం లేదు

కమిషనర్ రంగనాథ్

విశాలాంధ్ర-హైదరాబాద్: బుచ్చమ్మ ఆత్మహత్యకు... హైడ్రాకు ఎలాంటి సంబంధం లేదని కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. మీడియాతో శనివారం ఆయన మాట్లాడుతూ... యాదవబస్తీలో గుర్రంపల్లి బుచ్చమ్మకు చెందిన మూడు ఇళ్లకు నోటీసులు ఇవ్వలేదని చెప్పారు. బుచ్చమ్మ ఆత్మహత్యపై కూకట్ పల్లి ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడానని...కూతుళ్లకు రాసిచ్చిన ఇళ్లు కూకట్‌పల్లి చెరువుకు సమీపంలోనే ఉన్నప్పటికీ ఎఫ్‌టీఎల్ పరిధికి దూరంగా ఉన్నాయన్నారు. కూల్చివేతల్లో భాగంగా తమ ఇళ్లను కూలుస్తారనే భయంతో ఆమె కూతుర్లు బుచ్చమ్మను ప్రశ్నించడంతో మనస్తాపానికి గురైన ఆమె ఆత్మహత్య చేసుకుందని వివరించారు. ఈ ఘటనతో హైడ్రాకు సంబంధం లేదని స్పష్టం చేశారు. వివరణ లేకుండా హైడ్రా గురించి సోషల్ మీడియాలో గానీ, సామాజిక మాధ్యమాల్లో గానీ ప్రజల్లో భయాలు పుట్టించవద్దని మీడియా నిర్వాహకులను కోరారు. సోషల్ మీడియా ఛానళ్లు ప్రత్యేక అజెండాతో హైడ్రాపై అవాస్తవ, నకిలీ వార్తలను ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు.

మళ్లీ ఏపీకి లులు

(మొదటిపేజీ తరువాయి)

తిరుపతిలో హైపర్ మార్కెట్, మల్టీప్లెక్స్ నిర్మించే అంశంపై చర్చించారు. అదే విధంగా రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీలో పెట్టుబడులు పెట్టేందుకు లులు గ్రూప్ ఆసక్తి చూపింది. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో విశాఖలో పెట్టుబడులకు లులు గ్రూప్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వ తీరు కారణంగా లులు గ్రూప్ రాష్ట్రం నుంచి వెనక్కి పోయింది. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో పెట్టుబడులు పెట్టేందుకు లులు గ్రూప్ ఆసక్తి చూపుతోంది. లులు గ్రూప్ చైర్మన్‌తో సమావేశం సందర్భంగా సీఎం చంద్రబాబు... ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు తాము సహకారం, ప్రాధాన్యం ఇస్తున్నామని వారికి తెలిపారు. లులు గ్రూప్ తిరిగి ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపడంపై సంతోషం వ్యక్తం చేశారు. లులు గ్రూప్ వంటి సంస్థల రాకతో రాష్ట్రంలో పెట్టుబడులపై పారిశ్రామిక వేత్తల్లో ఆసక్తి కలిగిస్తుందన్నారు. ఇది రాష్ట్రానికి మేలు చేస్తుందని సీఎం అభిప్రాయ పడ్డారు. రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సహించడానికి తాము తీసుకువస్తున్న నూతన విధానాల గురించి చంద్రబాబు లులు గ్రూప్ చైర్మన్‌కు వివరించారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపినందుకు ధన్యవాదాలు తెలిపారు. లులు గ్రూప్ చైర్మన్‌తో పాటు హాజరైన సంస్థ ప్రతినిధులను ముఖ్యమంత్రి ఈ సందర్భంగా సత్కరించారు.

కృత్రిమ మేధతో బాధితులకు న్యాయం

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపు

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి: ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం సాంకేతికంగా ఎన్నో మార్పులు వస్తున్నాయని, న్యాయ వ్యవస్థ కూడా కృత్రిమమేధను మరింత ఉపయోగించుకొని బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అన్నారు. ధనికులతో పోలిస్తే పేదలు న్యాయం పొందలేకపోతున్నారని.. మెరుగైన సమాజం కోసం ఈ విధానంలో మార్పు రావాలని రాష్ట్రపతి అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ న్యాయబద్ధంగా సత్యాగ్రహ దీక్ష చేసి ఆదర్శంగా నిలిచారని ముర్ము అన్నారు. నిబద్ధత, పారదర్శకంగా పనిచేస్తే న్యాయవాద వృత్తిలో ఎంతో ఎత్తుకు ఎదగొచ్చని తెలిపారు. శనివారం నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 21వ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మన రాజ్యాంగంలో కీలకమైన సామాజిక న్యాయం అనే భావనను లోతుగా అర్థం చేసుకోవాలని పట్టభద్రులకు ఆమె సూచించారు. విలువలకు కట్టుబడి సానుకూల సామాజిక మార్పులకు సారథులుగా నూతన స్నాతకులు ఉండాలని ఆకాంక్షించారు. నల్సార్ వర్సిటీ జంతు సంరక్షణ చట్టాల గురించి చేస్తున్న కృషిని ప్రస్తావించారు. బంగారు పతకాల విజేతలలో అమ్మాయిలే ఎక్కువ సంఖ్యలో ఉన్నారంటూ... అనేక పరిమితులు ఉన్నప్పటికీ తమ ఉన్నత ప్రదర్శనతో మనల్ని గర్వపడేలా చేస్తున్నారన్నారు. నల్సార్ విశ్వవిద్యాలయం మహిళా న్యాయవాదులు, న్యాయ విద్యార్థులతో కూడిన దేశవ్యాప్త నెట్వర్క్‌ను ఏర్పాటు చేయడానికి చొరవ తీసుకోవాలని సూచించారు. పీహెచ్‌డీ, ఎల్ఎల్ఎంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్రపతి చేతుల మీదుగా బంగారు పతకాలు అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్.నరసింహులు తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ లా యూనివర్సిటీ ఛాన్సలర్ అలోక్ ఆరాదే స్నాతకోత్సవ సభకు అధ్యక్షత వహించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రారంభమైన స్నాతకోత్సవానికి ప్రొఫెసర్ ఎస్.వాసంతి నల్సార్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఎస్.వాసంతి నేతృత్వం వహించారు. అంతకు ముందు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి.. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, సీఎస్ శాంతి కుమారి, డీజీపీ జితేందర్ స్వాగతం పలికారు. నల్సార్ లా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ.కృష్ణ దేవరావు తన సంక్షిప్త స్వాగత ప్రసంగంలో విశ్వవిద్యాలయానికి ఆర్థిక సహాయం అందించినందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంతర్ విభాగ అధ్యయనాలు చేయడం ఆధునిక విద్యారంగంలో చాలా ప్రధానం అని చెప్పారు. యూనివర్సిటీ విద్యా విభాగాలను వైవిధ్యపరచడానికి ఉదారంగా సహాయం అందించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 582 డిగ్రీలను ప్రదానం చేశారు.

రాష్ట్రపతికి ఘన స్వాగతం

ఒక్కరోజు పర్యటన నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ఉదయం హైదరాబాద్ చేరుకున్నారు. బేగంపేట విమానాశ్రయంలో ముర్ముకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు ఘన స్వాగతం పలికారు.

లడ్డూ కల్తీపై బాబు కట్టుకథ: బుగ్గన

విశాలాంధ్ర-డోన్ రూరల్: తిరుమల లడ్డూ కల్తీపై ముఖ్యమంత్రి చంద్రబాబు కట్టుకథ అల్లారని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ విమర్శించారు. వైసీపీపై దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామ న్నారు. బుగ్గన శనివారం కర్నూలు జిల్లా, డ్రోన్ పట్టణంలోని మధు ఫంక్షన్ హాలు నుంచి పాత బస్టాండ్ మీదుగా వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఆలయంలో వైసీపీ నేతలతో కలిసి పూజ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు స్వార్థ రాజకీయాల కోసం గుడిని, ప్రసాదాన్ని వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి తిరుమల పర్యటనకు అనుమతి లేదని నోటీసులు ఇవ్వడం దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని బుగ్గన విమర్శించారు. వైసీపీ నేతలకు అక్రమ నోటీసులు, అరెస్టు చేస్తామని బెదిరించడం వంటి పద్ధతులు అవలంభిస్తూ రాక్షస రాజ్యం సాగిస్తున్నారని, ఇటువంటి పరిపాలన ఎన్నడూ చూడలేదని బుగ్గన రాజేంద్రనాథ్ విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేశ్, వైస్ చైర్మన్ జాకిర్, జెడ్పీటీసీ రాజకుమార్, ఎంపీపీ రేగాటి రాజశేఖర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రామచంద్రుడు, నంద్యాల జిల్లా బీసీ అధ్యక్షుడు ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు హరి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అతిథి టూర్స్ అండ్ ట్రావెల్స్‌కు 'బెస్ట్ ఎమర్జింగ్' అవార్డు

విశాలాంధ్ర-విజయవాడ: పర్యాటక రంగంలో అందించిన విశిష్ట సేవలకు విజయవాడకు చెందిన అతిథి టూర్స్ అండ్ ట్రావెల్స్... 'బెస్ట్ ఎమర్జింగ్ ట్రావెల్ కంపెనీ ప్రమోటింగ్ ఆంధ్రప్రదేశ్' అవార్డును రెండోసారి కైవసం చేసుకుంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శనివారం ఈ అవార్డును కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ చిట్టూరి భార్గవి... పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ చేతుల మీదుగా అందుకున్నారు. భార్గవి మాట్లాడుతూ... దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌ను పర్యాటక రంగంలో మొదటిస్థానంలో నిలబెట్టేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. సీఎం చంద్రబాబునాయుడు, నూకసాని బాలాజీ, వసంత కృష్ణ ప్రసాద్, గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు.

ఏజే విద్యా సంస్థలు స్వాధీనం చేసుకోవాలి

సీఎం చంద్రబాబుకు శ్రీనివాసరావు లేఖ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: మచిలీపట్నంలో ఆంధ్ర జాతీయ విద్యా పరిషత్ అధ్వర్యంలో నడపబడుతున్న విద్యా సంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు శనివారం ఆయన లేఖ రాశారు. స్వదేశీ విద్యకు తగిన ప్రోత్సాహం ఇవ్వాలనే ఆశయంతో స్వాతంత్ర్య సమరయోధులు కొందరు ఏజే విద్యా పరిషత్, అనుబంధ విద్యా సంస్థలు స్థాపించారని చెప్పారు. 365 ఎకరాల విలువైన భూమి, భవనాలు ఉన్నాయన్నారు. నేడు విద్యా సంస్థలు అక్రమాలు, అవినీతిమయమయ్యాయని, వీటికి ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్‌గా కొనసాగుతున్న కోపల్లె హనుమంతరావు కేంద్ర బిందువుగా ఉన్నారన్న వార్తలు వస్తున్నాయని వివరించారు. పోలీసు శాఖలో పనిచేస్తూ విద్యా సంస్థలకు వారసునిగా కూడా చలామణీ అవుతున్నారన్నారు. సంస్థ వ్యవస్థాపకులు రూపొందించిన మెమోరాండం ఆఫ్ ఆర్టికల్స్‌లో వ్యవస్థాపక సభ్యుల కుటుంబ సభ్యులకు వారసత్వ హక్కులుండవని పేర్కొన్నప్పటికీ అక్రమంగా కొనసాగుతున్నారని తెలుస్తోందన్నారు. దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు కోరారు. టీచింగ్ స్టాఫ్ నియామకంలో రోస్టర్ పాయింట్లు 2 నిర్ణయించకపోవడంపై విజిలెన్స్ దర్యాప్తు జరిగిందని, ఇంత వరకు రిపోర్టు వెలువడలేదన్నారు.

మైనింగ్ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు

షర్మిల డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: గత ప్రభుత్వ హయాంలో జరిగిన మైనింగ్ కుంభకోణంపై ఏసీబీ సమగ్ర దర్యాప్తు జరపాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. మైనింగ్ శాఖ మాజీ ఎండీ వెంకటరెడ్డిని అరెస్టు చేసిన నేపథ్యంలో శనివారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆమె స్పందించారు. వైసీపీ పాలనలో జరిగిన గనుల దోపిడీపై వెంకట్ రెడ్డి వంటి తీగలే కాదు... పెద్ద డొంకలు కూడా కదలాలి... ఆ పెద్ద డొంక ఏ ప్యాలెస్‌లో ఉన్నా విచారణ జరపాలి... రూ.2,566 కోట్ల దోపిడీకి పాల్పడ్డ ఘనుడు వెంకట్ రెడ్డి అయితే... తెరవెనుక ఉండి, సర్వం తానై వేల కోట్లు కాజేసిన ఆ ఘనాపాటి ఎవరో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు అన్నారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో అడ్డగోలుగా సహజ సంపదను దోచుకుతిన్నారు. అస్మదీయ కంపెనీలకు మైనింగ్ కాంట్రాక్టులు ఇచ్చారు. టెండర్లు, ఒప్పందాలు, ఏపీఎంఎంసీ నిబంధనలను బేఖాతరు చేసి అనుకున్న కంపెనీకి టెండర్లు కట్టబెట్టారు. ఎన్‌జీటీ నిబంధనలు తుంగలో తొక్కారు. రాష్ట్ర ఖజానాకు రావాల్సిన నిధులు సొంత ఖజానాకు తరలించారు అని ధ్వజమెత్తారు. చిన్న చేపలను ఆడించి సొమ్ము చేసుకున్న పెద్ద తిమింగలాన్ని పట్టుకొనేలా దర్యాప్తు జరగాలి అని కూటమి ప్రభుత్వాన్ని షర్మిల డిమాండ్ చేశారు. సీబీఐ విచారణ కోరాలని సూచించారు.

జగన్‌కు దేశ బహిష్కరణే సరైన శిక్ష

హోంమంత్రి అనిత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని తిరుమల లడ్డూ కల్తీపై మాట్లాడమంటే పులకేసిలా వ్యవహరిస్తున్నారని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. తిరుమలకు వెళ్లకుండా ఆయన్ను ఎవరూ అడ్డుకోలేదని, హిందుత్వంపై విశ్వాసంలేకే సెక్షన్ 30పై కుంటి సాకులు చెబుతూ ఆగిపోయారన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 10 వేల మందితో ఆయన తిరుమలకు వస్తున్నట్లు సోషల్‌మీడియాలో విస్తృత ప్రచారం జరిగిందని... అందుకే వారి పర్యటనను అడ్డుకుంటామని ప్రజాసంఘాలు, ధార్మిక సంఘాలు ప్రకటించాయన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకూడదని, బ్రహ్మోత్సవాలకు, భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా పోలీసులు సెక్షన్ 30 యాక్ట్‌ను అమలు చేశారని వివరించారు. దాన్ని ప్రజల్లోకి తప్పుగా తీసుకెళ్లేందుకే మీడియా ముందుకు వచ్చి అబద్ధాలు చెబుతున్నాడన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్క నాయకుడ్ని అడ్డుకోవడం, హౌస్ అరెస్టులు చేయడం జరగలేదని అనిత చెప్పారు. జగన్‌కు అసలు తిరుపతికి వెళ్లడమే ఇష్టం లేదని, డిక్లరేషన్ ఇచ్చి వెళ్లడానికి అసలే ఇష్టం లేదని అన్నారు. కల్తీ నెయ్యిపై మాట్లడకుండా జగన్ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని దుయ్యబట్టారు. దీనిపై సిట్ ఏర్పాటు చేస్తే... సొంత మనుషులతో సిట్ చేర్పాటు చేశారని మాట్లాడటం సరికాదన్నారు. ఆయన ఉద్దేశంలో సిట్ సాక్షి ఉద్యోగలతో వేయాలో ఏమో అని ఎద్దేవా చేశారు. డిక్లరేష్ తీసుకుని శ్రీవారి మీద నమ్మకం ఉందని వెళితే తప్పేంటని ప్రశ్నించారు. జగన్ తప్పుచేసి కులమతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా దళితులకు ఆపాదించడం సిగ్గుచేటన్నారు. అసలు దళితుల గురించి మాట్లాడే అర్హతే లేదన్నారు. జగన్ మానత్వం గురించి మాట్లాడితే ఆ మానవత్వం అనే పదమే సిగ్గుపడుతుందన్నారు. ఇదేం దేశమని జగన్ మాట్లాడుతున్నాడంటే...దేశం విడిచి పారిపోవడానికి ప్లాన్ చేస్తున్నాడేమోనన్నారు. గత ఐదేళ్లు రాష్ట్రాన్ని కొల్లగొట్టి బయట దేశాల్లో దొంగ డబ్బు దాచేసి దేశం విడిచి వెళ్లిపోవడానికి సిద్ధమయ్యే ఇటువంటి మాటలు మాట్లాడుతున్నారన్న అనుమానం కలుగుతోందన్నారు. జగన్‌మోహన్ రెడ్డికి దేశ బహిష్కరణే సరైన శిక్ష అన్నారు.

నియంతృత్వం కోసమే 'జమిలి'

అక్కినేని వనజ

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: దేశంలో నియంతృత్వ రాజ్య స్థాపనకే కేంద్రంలోని మోదీ సర్కారు 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' విధానం తెరపైకి తెచ్చిందని... ఇది ఆచరణ సాధ్యం కాదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక ఊర్వశి సెంటర్ వద్ద సీపీఐ కూరగాయలసెక్షన్ శాఖ సమావేశం జి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. తొలుత భారత విప్లవ యోధుడు సర్దార్ భగత్‌సింగ్ 117వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి అక్కినేని వనజతోపాటు సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, నగర కార్యదర్శి వి.కొండలరావు, జట్టు సంఘం అధ్యక్షులు కోండ్రపు రాంబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన శాఖ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన అక్కినేని వనజ మాట్లాడుతూ... ఏ స్వతంత్రం కోసమైతే భగత్ సింగ్ ఉరికంభం ఎక్కారో ఇప్పటికీ ఆ స్వతంత్ర ఫలాలు ప్రజలకు దక్కకపోవడం విచారకరమన్నారు. సామ్రాజ్యవాద విష సంస్కృతికి వ్యతిరేకంగా సోషలిజం కోసం భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని ఆమె యువతను కోరారు. భిన్న మతాలు, కులాలు, సంస్కృతులు, జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలతో కూడిన వైవిధ్యభరిత భారతదేశంలో ఒకే దేశం-ఒకే ఎన్నిక ఆచరణ సాధ్యం కాదన్నారు. ఇది అధ్యక్ష తరహా నియంతృత్వాన్ని దేశంపై రుద్దేందుకు మోదీ కుట్ర అని ఆమె అన్నారు. మోదీ ప్రజా సమస్యలను పక్కదారి పట్టించి హిందూ మతోన్మాదంతో విద్వేష రాజకీయాలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆమె అన్నారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత దేశంలో ఎప్పుడూ లేనంతగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని వంటనూనె ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇక రాష్ట్రంలో ప్రజాసమస్యల పరిష్కారంపై ఆలోచించకుండా కూటమి ప్రభుత్వం లడ్డూ రాజకీయం చేస్తోందని...ఇప్పటికైనా దేవుని పేరుతో రాజకీయాలు చేయడం ఆపేయాలని హితవు పలికారు. బీజేపీ ఉచ్చులో పవన్ కల్యాణ్ , చంద్రబాబు పడకూడదన్నారు. సీపీఐ డిసెంబర్ 26 తో శత వార్షికోత్సవాలు ప్రారంభమవుతున్నాయని పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని ఆమె పిలుపునిచ్చారు. శాఖ బలోపేతంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో తాటిపాక మధు, కే రాంబాబు, కొండలరావు జట్లు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సప్ప రమణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె జ్యోతి రాజు, కూరగాయలు సెక్షన్ నాయకులు ఎస్ అప్పలరాజు, కన్నారావు, దేవుడు మంగపతి తదితర నాయకులు ప్రసంగించారు.

తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

- ఉక్కు కర్మాగారం వద్ద ఒప్పంద కార్మికుల ఆందోళన
- సీఎం చొరవతో లభించిన పరిష్కారం

విశాలాంధ్ర-గాజువాక: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకునేందుకు కార్మికులు దశలవారీగాఉద్యమాలు సాగిస్తున్నారు. తాజాగా ఒప్పంద కార్మికులు నాలుగు వేల మందిని తొలగించడానికి నిరసనగా శనివారం భారీ ఆందోళన నిర్వహించారు. ఉక్కు పరిశ్రమ ప్రధాన ద్వారంతో పాటు బీసీ గేటు వద్ద నిరసన తెలిపారు. 30శాతం మంది ఒప్పంద కార్మికులపై వేటు వేసేలా కేంద్రం ఇచ్చిన ఆదేశాల మేరకు నాలుగు వేల మందిని ఉద్యోగాల్లో నుంచి తొలగించడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తంచేశారు. తొలగించిన కార్మికులు అందరినీ తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాన్ని నిరసించారు. నియామకాలు చేపట్టాల్సింది పోయి ఉన్న వారినే తొలగించడం ఏమిటంటూ యాజమాన్యాన్ని ప్రశ్నించారు. తక్షణమే ఆదేశాలను రద్దు చేసి నాలుగు వేల మందిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ముఖ్యమంత్రి చొరవతో కార్మికుల సమస్యకు పరిష్కారం లభించింది. వారిని తిరిగి విధుల్లోకి తీసుకునేలా కేంద్రం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఉక్కు కర్మాగార ఒప్పంద కార్మికుల వెతల గురించి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్‌కు కార్మిక నేతలు వివరించగా వారు విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామితో మాట్లాడితే... తొలగించిన ఒప్పంద కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ప్లాంటు యాజమాన్యానికి ఉక్కుశాఖ సంయుక్త కార్యదర్శి ద్వారా ఆదేశించారు. కాగా, ఆందోళనలో కార్మిక నేతలు డి.ఆదినారాయణ, కేఎస్ఎన్ రావు, జె.రామకృష్ణ, జె.అయోధ్యరామ్, రామస్వామి, కారు రమణ, మహాలక్ష్మి నాయుడు, డేవిడ్, వరసాల శ్రీనివాస రావు, కె.వరంధామయ్య, విల్లా రామ్మోహన్ కుమార్, నమ్మి సింహాద్రి, గుమ్మడి నరేంద్ర, ఉక్కు నిర్వాసిత నాయకులు పులి వెంకట రమణారెడ్డి, రమణ మూర్తి, విశాఖ స్టీల్ ప్రాజెక్టు ఒప్పంద కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి రవి పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై జేపీసీ అభిప్రాయ సేకరణ

వివాదాస్పద అంశాలు తొలగించాలి: ఏపీ ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకున్న వక్ఫ్ సవరణ బిల్లు-2024లో వివాదస్పద అంశాలను తొలగించాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ,న్యాయ శాఖ మంత్రి ఫరూక్ జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి విజ్ఞప్తి చేశారు. వక్ఫ్ సవరణ బిల్లుపై అభిప్రాయ సేకరణ నిమిత్తం జాయింట్ పార్లమెంటరీ కమిటీ క్షేత్రస్థాయి పర్యటన చేపట్టింది. శనివారం హైదరాబాద్ తాజ్ కృష్ణలో జేపీసీ చైర్‌పర్సన్ జగదాంబికా పాల్ అధ్యర్యంలో జేపీసీ సమావేశమైంది. కమిటీ ముందు ఏపీ, తెలంగాణ, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రతినిధులు తమ అభిప్రాయాలు వినిపించారు. సమావేశానికి ముందుగా ఏపీ తరపున మంత్రి ఫరూక్ 15 మందితో కూడిన ప్రతినిధులతో కలిసి కమిటీ సభ్యులతో సమావేశమై సవరణ బిల్లుపై కొన్ని అభ్యంతరాలను తెలియజేశారు. తదుపరి మీడియాతో మంత్రి ఫరూక్ మాట్లాడుతూ జేపీసీకి వక్ఫ్ సవరణ బిల్లు వెళ్లేలా చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు యావత్ ముస్లిం సమాజం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. వక్ఫ్ సవరణ బిల్లులో ముస్లింలకు మేలు చేకూర్చే అంశాలను సమర్థిస్తూనే, వివాదాస్పద మైనటువంటి బిల్లులోని వివిధ అంశాలపై అభ్యంతరాలను తెలియజేయడం జరిగిందన్నారు. జేపీసీ అభిప్రాయ సేకరణ సమావేశానికి ఏపీ తరపున హాజరైన 15 మందిలో మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ సి.శ్రీధర్, డిప్యూటీ కమిషనర్ ఎల్.సుధాకర రావు, వక్ఫ్ బోర్డు సీఈవో ఎల్ అబ్దుల్ ఖదీర్, డిప్యూటీ సెక్రటరీ మహమ్మద్ అలీ, అసిస్టెంట్ సెక్రటరీ సయ్యద్ ఆదామ్ షఫీ, హైకోర్టు న్యాయవాదులు షఫీకుజ్జామన్, సలీం పాషా, మాజీ లా ఆఫీసర్ మున్వార్ హుస్సేన్, గుంటూరు మసీదు ముతావలి కలీం బేగ్, కడప దర్గా ముతావల్లి తాహిరుల్లా ఖాద్రి, మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా, మాజీ ఎమ్మెల్యే గఫూర్, మండలి మాజీ చైర్మన్ షరీఫ్, మాజీ ఐజీ ఇక్బాల్, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎం.ఫరూక్ షబ్లీ ఉన్నారు.

బిల్లుకు మేం వ్యతిరేకం:వైసీపీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న వక్ఫ్ సవరణ బిల్లుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకమని ఆపార్టీ తరపున మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ జేపీసీకి తెలియజేశారు.హైదరాబాద్‌లో జేపీసీతో జరిగిన సమావేశంలో ఈ వక్ఫ్ సవరణ బిల్లును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎందుకు వ్యతిరేకిస్తుందో లిఖితపూర్వకంగా నివేదక అందజేశామని హాఫీజ్‌ఖాన్ మీడియాకు తెలిపారు. ఈ సవరణ బిల్లు వల్ల ముస్లిం సమాజానికి జరిగే నష్టాన్ని వారికి వివరించాం. వక్ఫ్ భూములకు సంబంధించి కలెక్టర్‌కు అథారిటీ ఇవ్వాలనుకుంటున్నారు. కానీ దానికి వక్ఫ్ ట్రిబ్యునల్ ఉంది. ట్రిబ్యునల్‌ను బలహీనపరిచేలా ఈ బిల్లు ఉంది, ఈ బిల్లు వస్తే ముస్లిం సమాజం తీవ్రంగా ఇబ్బందులు పడుతుంది, ముస్లిం సమాజం అంతా దీనిని వ్యతిరేకిస్తోంది. మా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి చాలా స్పష్టంగా ఈ బిల్లును వ్యతిరేకించాలని చెప్పారు. జేపీసీ మెంబర్‌గా ఉన్న ఎంపీ విజయసాయిరెడ్డి కూడా దీనిని వ్యతిరేకిస్తూ లిఖితపూర్వకంగా తెలిపారు. అయితే టీడీపీ మాత్రం పార్లమెంట్‌లో ద్వంద్వ వైఖరి అవలంబిస్తోంది. ఈ అంశాన్ని గందరగోళంలో పడేస్తోంది. టీడీపీ ఇప్పుడు కూడా రెండు కళ్ల ధోరణి అనుసరిస్తోంది. టీడీపీ పార్లమెంట్‌లోనే వ్యతిరేకించి ఉంటే జేపీసీ వరకు వచ్చేది కాదు. కానీ అక్కడ మద్దతిచ్చి ఇక్కడ ఇలా నాటకాలు ఆడుతోందని ఆయన విమర్శించారు.

'చేనేత' అభివృద్ధికి ప్రాధాన్యం

రాష్ట్ర వ్యాప్తంగా ఎగ్జిబిషన్లు... హ్యాండ్లూమ్ బజార్‌లు: సవిత

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించేలా రాష్ట్ర వ్యాప్తంగా ఎగ్జిబిషన్లు, హ్యాండ్లూమ్ బజార్‌లు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. విజయవాడ పీవీపీ స్క్వేర్ మాల్‌లో ఏర్పాటు చేసిన హ్యాండ్లూమ్ బజార్‌ను శనివారం ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... చేనేత కార్మికులకు, పరిశ్రమ అభివృద్ధికి సీఎం చంద్రబాబు నాయుడు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ట్రెండ్‌కు తగ్గట్లుగా చేనేత దుస్తుల తయారీలో డిజైన్లను క్రాఫ్ట్ కౌన్సిల్ అధ్వర్యంలో నూతన డిజైన్లు రూపొందిస్తున్నామన్నారు. ఈ డిజైన్లను చేనేత వస్త్రాల తయారీలో వినియోగించేలా నేతన్నలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. సహజసిద్ధ రంగుల వినియోగంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. తొలుత మంత్రి...హ్యాండ్లూమ్ బజార్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అమ్మకాలు ఎలా సాగుతున్నాయి అని అడిగి తెలుసుకున్నారు. ఏపీతో పాటు బెంగుళూరు, చెన్నై సహా ఇతర రాష్ట్రాలకు చెందిన చేనేత కార్మికులు స్టాళ్లను ఏర్పాటు చేశారు. క్రాఫ్ట్ స్టాల్ వద్ద ఆభరణాలను పరిశీలించారు. ఓ స్టాల్ వద్ద చేనేత చీరను సవిత, ఆ శాఖ కమిషనర్ రేఖారాణి చీరలు కొనుగోలు చేశారు. క్రాఫ్ట్ కౌన్సిల్ ప్రతినిధులు రంజన, సుజాత పాల్గొన్నారు.

వైద్యవిద్య ప్రైవేటీకరణ అడ్డుకుంటాం: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అనకాపల్లి: వైద్యవిద్య ప్రైవేట్ పరం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీ జాన్సన్ బాబు అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య అనకాపల్లి జిల్లా ప్రథమ మహాసభలు శనివారం జిల్లా కేంద్రంలో జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన జాన్సన్ బాబు మాట్లాడుతూ... ప్రభుత్వ విద్య కనుమరుగు అవుతున్న తరుణంలో అనకాపల్లి జిల్లా కేంద్రంగా ప్రభుత్వం యూనివర్సిటీ ఏర్పాటు చేయకపోవడం విద్యను నిర్వీర్యం చేయడమే అని అన్నారు. ప్రభుత్వ విద్య నిర్వీర్యం, వైద్యవిద్య ప్రైవేట్ పరం చేసే ప్రయత్నాలను అడ్డుకోవడానికి ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. హాస్టల్ సమస్యలపై పోరాటం చేస్తున్నా... ప్రభుత్వం స్పందించలేదన్నారు. భగత్ సింగ్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ మాజీ నేత, సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ... 32 మంది ప్రాణ త్యాగాలతో నిర్మితమై రాష్ట్రానికి తులమానికంగా ఉన్న విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేస్తూ ఉంటే స్థానిక నాయకులు, ప్రభుత్వం కళ్లు అప్పగించి చూడడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే మహాసభ వేదికగా విద్యార్థులంతా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బీ బాబ్జి అధ్యక్షతన జరిగిన సభలో భగత్ సింగ్ 117వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తొలుత వందలాదిమంది విద్యార్థులతో పట్టణ పురవీధుల్లో ప్రదర్శన చేశారు. రాష్ట్ర సహాయ కార్యదర్శులు షేక్ మస్తాన్, నాగభూషణం, రాజాన దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఫణింద్ర కుమార్, జగదీశ్, సతీశ్, శ్రీను, తాతాజీ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో విశాఖ ఉక్కు పరిరక్షణ: జాన్సన్ బాబు

విశాలాంధ్ర-విశాఖ: విప్లవ వీరుడు భగత్ సింగ్ స్ఫూర్తితో విశాఖ ఉక్కు పరిరక్షణకు ముందడుగు వేద్దామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ 117వ జయంతి సందర్భంగా విశాఖ ఆర్కే బీచ్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భగత్ సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టం (బీఎన్ఈజీఏ) అమలు చేసి యువత భవిష్యత్‌కు హామీనివ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. విద్య కాషాయీకరణ, ప్రైవేటీకరణ... నూతన జాతీయ విద్యావిధానం ద్వారా పాఠ్యపుస్తకాల్లో నుంచి డార్విన్ సిద్ధాంతాన్ని, స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్రలు తొలగించి... గాడ్సే లాంటి దేశద్రోహుల గురించి చేర్చడం ద్వారా పిల్లల్లో మూఢ నమ్మకాలు, మత విద్వేషాలను నూరి పోస్తున్నారన్నారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలపై విద్యార్థులు, యువజనులు ఉద్యమించాలని జాన్సన్‌బాబు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వై.రాంబాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీను, విద్యార్థులు కిరణ్, శేఖర్ హేమానంద్, సింహాచలం పాల్గొన్నారు.

4వ తరగతి ఉద్యోగులుగా హమాలీలు

రవీంద్రనాథ్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ మండల స్థాయి స్టాక్‌పాయింట్‌లో పనిచేస్తున్న హమాలీ కార్మికులను నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్త కూలీ రేట్ల జీవో విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గొల్లపూడి స్టాక్ మార్కెట్ వద్ద కార్మికులు రెండు గంటలు పని నిలిపివేశారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ పేదలకు బియ్యం సరఫరా చేయటంలో హమాలీలు నిరంతరం పని చేస్తుంటారని, చట్టం ప్రకారం వారికి కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. హమాలీలకు పీఎఫ్, పింఛన్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ దసరా పండుగకు ఇచ్చే బోనస్, స్వీటు, బట్టలు వెంటనే ఇవ్వాలన్నారు. మేస్త్రీలు తాతయ్య, వీర్రాజు, రవిబాబు, సత్యం, రమణయ్య, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఏడీపీ అధ్యయనం

సాగు క్షేత్రాలు సందర్శించిన ప్రతినిధులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం చేసేందుకు ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) ప్రతినిధి బృందం శనివారం ఎన్టీఆర్ జిల్లాలోని సాగు క్షేత్రాలను సందర్శించింది. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్ నేతృత్వంలో ఏడీబీ ప్రతినిధులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవగాహన చేసుకున్నారు. ఏఎఫ్ఎస్ఆర్ సెక్టార్ ఎమర్జింగ్ ఏరియా డైరెక్టర్ తకేషి యూయెడ, సీనియర్ ప్రాజెక్ట్ అనలిస్ట్ రాఘవేంద్ర, ప్రాజెక్ట్ అధికారి కృష్ణ రౌటెలా... రెడ్డిగూడెం గ్రామానికి వెళ్లి ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నిర్వహించే ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) కార్యక్రమాలను పరిశీలించారు. ఏపీసీఎన్ఎఫ్ మోడల్ మండలాల్లో రెడ్డిగూడెం ఒకటి. వాతావరణ మార్పులకు కమ్యూనిటీల స్థితిస్థాపకతను పెంచడానికి వాతావరణ-ఆధారిత పెట్టుబడి ప్రాజెక్టుల అభివృద్ధే ఏడీబీ లక్ష్యం. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు విభిన్న సమూహాలు ఏ విధంగా కలిసి పనిచేస్తాయో విజయకుమార్ వారికి వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రకృతి వ్యవసాయం అవలంభిస్తున్న సమగ్ర విధానాన్ని ప్రదర్శిస్తూ ప్రతి సూత్రాన్ని వివరించారు. పంటల ఆరోగ్యాన్ని పెంపొందించడంలో బయో స్టిమ్యులెంట్ల ప్రాముఖ్యత, వాటి తయారీ, వినియోగం గురించి తెలిపారు. రెడ్డిగూడెంలోని 2.5 ఎకరాల మామిడి పొలాల్లో ఎకరం భూమిలో వరిసాగు చేసిన గోగులమూడి సునీత అనే ప్రకృతి వ్యవసాయ వృత్తిదారుల పొలాలను ప్రతినిధులు సందర్శించి... అనుసరించే విధానాల గురించి ఆరాతీశారు. సవాళ్లు అధిగమించడానికి వినియోగంచే వినూత్న మార్గాల గురించి తెలుసుకున్నారు. పెట్టుబడి, రాబడులు, ఖర్చులతో సహా ఆర్థిక అంశాలపై తమకు వివరించిన మహిళా రైతు రాధను ప్రతినిధులు అభినందించారు.

హమాలీల కూలీరేట్ల జీవో ఇవ్వండి

మంత్రి నాదెండ్ల మనోహర్‌కు నేతల వినతి

విశాలాంధ్ర-విజయవాడ: పౌర సరఫరాల శాఖలో పనిచేస్తున్న హమాలీల కూలీరేట్లకు సంబంధించి నూతన జీవో వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు విన్నవించారు. ఈ మేరకు శనివారం మంత్రికి వినతిపత్రం అందజేశారు. పౌరసరఫరాల కార్పొరేషన్ హమాలీ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్వర్యంలో కార్మికులకు నూతన కూలీ రేట్ల జీవో విడుదల చేయాలని, పని భద్రత కల్పించాలని, ప్రతి నెలా 10వ తేదీ నాటికి నెల బిల్లులు చెల్లించాలని, రూటు మార్చే విధానం రద్దు చేయాలని కోరుతూ మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసనలు, రెండు గంటల మెరుపు సమ్మె కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో యూనియన్ రాష్ట్ర నాయకత్వం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య, రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి రావుల అంజిబాబు మంత్రి నాదెండ్ల మనోహర్‌ను కలిసి సమస్యలపై చర్చించారు. మంత్రి మనోహర్ స్పందిస్తూ వారం రోజుల్లో కార్మిక సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఏఐటీయూసీ నాయకులు మీడియాకు తెలిపారు.

సంపాదకీయం

రాజకీయ లడ్డూ

తిరుపతి వెంకన్న మీద తెలుగు, తమిళ ప్రజలకే కాదు... ఉత్తరాది వారికి కూడా అపారమైన నమ్మకం ఉంది. దేవుడొక్కడే అని దాదాపు అన్ని మతాల వారూ చెప్తుంటారు. కానీ తీరా ఆరాధన, మత విధుల దగ్గరకొచ్చే సరికి ఎవరి దారి వారిదే. దేవుడు సర్వాంతర్యామి అనుకున్నప్పటికీ కొన్ని గుళ్లలోని దేవుడికి జనాదరణ విపరీతంగా ఉంటుంది. వెంకటేశ్వరస్వామి గుళ్లు కొన్ని వేలు ఉండొచ్చు. కానీ తిరుపతి వెంకన్నకు ఉండే ఆదరణతో ఏ దేవాలయమూ పోటీపడడం అసాధ్యం. తిరుపతి లడ్డూ నాణ్యమైందన్న నమ్మకం చాలా కాలంగా ఉంది. ఎవరైనా తిరుపతి వెళ్లొస్తే ఇసుమంత లడ్డూ ప్రసాదం ఇస్తే జనం కళ్లకు అద్దుకుని భక్తి శ్రద్ధలతో స్వీకరిస్తారు. అలాంటి తిరుపతి లడ్డూ కల్తీది అని సాక్షాత్తు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రకటించడం లడ్డూ మీద భక్తి శ్రద్ధలను, తిరుపతి వెంకన్న మీద ఆరాధనా భావాన్ని ఇసుమంత కూడా తగ్గించినట్టు లేదు కానీ... లడ్డూ కల్తీ అయిందన్న మాట బాంబులా పేలింది. దాని చుట్టూ కల్తీ నివారణ చర్యలకన్నా రాజకీయాలకు, పరస్పర నిందారోపణలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్టు కనిపిస్తోంది. తిరుపతి లడ్డూ తయారీకి వాడే నెయ్యి కల్తీది అని తేలినప్పుడు కల్తీ నివారణకు చర్యలు తీసుకోవాలి. ఈ కల్తీకి బాధ్యులైన వారి మీద, ఆ కల్తీ సరుకుని ఆమోదించిన వారి మీద చర్య తీసుకుని ఉండవలసింది. ఇప్పటిదాకా ఆ జాడలే లేవు. ఈ వివాదం తలెత్తిన తరవాత ఎవరికి తోచింది వారు మాట్లాడుతున్నారు. తిరుపతి లడ్డూ నమూనాను జులై తొమ్మిదిన సేకరించారట. దాన్ని గుజరాత్‌లోని ఆనంద్‌లో ఉన్న సంస్థకు పరీక్ష కోసం పంపితే ఆ నివేదిక జులై 16న అందిందట. చంద్రబాబు నాయుడు ఈ విషయాన్ని సెప్టెంబర్‌లో బయట పెట్టారు. తిరుపతి లడ్డూలో నెయ్యితో పాటు ఇతర కొవ్వు పదార్థాలు కలిపారన్నది చంద్రబాబు నాయుడు వెల్లడించిన సమాచార సారాంశం. ఆ ఇతరేతర కొవ్వు పదార్థాలలో రకరకాల వనస్పతులతో పాటు చేప నూనె, గొడ్డు కొవ్వు, పంది కొవ్వు లాంటివి కలిశాయని చంద్రబాబు స్వయంగా ప్రకటించడంతో అగ్గి అంటుకుంది. ఈ సమాచారాన్ని ఆయన బయటపెట్టడంలో ఉద్దేశం గురించి అనేక ఊహాగానాలు చెలరేగాయి. చంద్రబాబు ఈ సమాచారం వెల్లడించిన తీరు మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను దోషిగా నిలబెట్టడానికి నిదర్శనంగా ఉంది. జగన్ క్రైస్తవ మతానుయాయి కనక ఈ కల్తీకి అనుమతించారన్న అర్థం వచ్చేట్టు చంద్రబాబు మాట్లాడారు. జగన్ తన సంజాయిషీ తాను ఇచ్చుకున్నారు. పవన్ కల్యాణ్ పదడుగులు ముందుకేసి ప్రాయశ్చిత్త దీక్ష ప్రారంభించారు. ఆ దీక్ష వచ్చే రెండవ తేదీన తిరుపతిలో దైవ దర్శనంతో విరమిస్తారట. ఆ దీక్షకు తగిన వస్త్ర ధారణలోనూ పవన్ కల్యాణ్ శ్రద్ధ తీసుకున్నారు. దేవాలయాల దగ్గర మెట్లు ఊడ్వడం, కడగడం లాంటి పనులన్నీ చేస్తున్నారు. సనాతన ధర్మాన్ని పరిరక్షించడానికి జాతీయ స్థాయి వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా పవన్ కల్యాణ్ కోరారు. ఇలాంటి వ్యవస్థ కల్తీని ఎలా నిరోధిస్తుందో తెలియదు. ఆయన అడుగుతున్న జాతీయ వ్యవస్థకు ఇంకా పెద్ద బాధ్యతలు అప్పగిస్తారు కాబోలు.

ప్రస్తుతం తిరుపతికి నెయ్యి సరఫరా చేస్తున్నది తమిళనాడులోని ఏఆర్ డెయిరీ అంటున్నారు. నెయ్యి సేకరించడం కోసం ఆరు నెలలకు ఒకసారి టెండర్లు పిలుస్తారు. టెండర్లలో అవకాశం దక్కించుకున్న వారు ట్యాంకర్లలో నెయ్యి సరఫరా చేస్తారు. దానిని దేవాలయంలో వినియోగించడానికి ముందు ఒక్కో ట్యాంకర్ నుంచి మూడు మచ్చులు తీసి పరీక్షిస్తారట. ఇందులో ఒక్క పరిశీలనలోనైనా అనుమానం కలిగితే ఆ ట్యాంకర్‌ను తిరస్కరిస్తారట. చూడడానికి ఇది పకడ్బందీ ఏర్పాటులా కనిపిస్తోంది. అయినా కల్తీ జరిగిపోయిందట. చంద్రబాబు నాయుడు జులైలో సేకరించిన నమూనాలను ఆనంద్‌లోని ప్రయోగశాలకే పరీక్ష కోసం ఎందుకు పంపారన్న అనుమానాలు బలంగా వ్యక్తమైనాయి. హైదరాబాద్‌లోనే ఫోరెన్సిక్ వ్యవస్థ ఉన్నప్పుడు అక్కడికి ఎందుకు పంపలేదు అన్న ప్రశ్నలూ తలెత్తుతున్నాయి. అదీ కాకపోతే ఘజియాబాద్‌లో జాతీయ ఆహార పరిశోధనా సంస్థకైనా నమూనాలు పంపి ఉండొచ్చుగా అన్న వాదనలూ వినిపించాయి. కల్తీ వ్యవహారం బయటికి పొక్కగానే హిందుత్వవాదులు అమాంతం క్రియాశీలం అయిపోయారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణా బాధ్యతలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోంచి తప్పించి దేవాలయ వారసత్వ ధర్మకర్తలకు అప్పగించాలని హిందుత్వ వాదులు వాదిస్తున్నారు. హిందూ మత, ధర్మకర్తృత్వ చట్టాలను సుప్రీంకోర్టు ఆమోదించినప్పుడు వంశపారంపర్య ధర్మకర్తలకు నిర్వహణా బాధ్యత అప్పగించాలనడం పచ్చి అవకాశ వాదమే. లడ్డూ నాణ్యతకు సంబంధించిన అంశం ఇంత పెద్ద వివాదంగా ఎందుకు తయారవుతోందో అర్థం కాదు. చంద్రబాబు నాయుడు అనుభవజ్ఞుడు. పాత కక్షలు మరిచిపోవడం ఆయనకు అలవాటు లేదు. జగన్ తనను 2023లో జైలులో పెట్టించాడు కనక ఇప్పుడు కల్తీ నెయ్యి ఆసరాగా పగ తీర్చుకోవడానికే లడ్డూపై రాజకీయం చేస్తున్నారన్న వాదన చాలా బలంగా ఉంది. దానితో పాటు మతానికి సంబంధించిన అంశాలు ఆధారంగా చేసుకుని వివాదం లేవనెత్తి తాను ఎంతటి విధేయుడినో బీజేపీ నేతలకు నిరూపించాలనుకుంటున్నారేమో. ఇప్పటి దాకా చంద్రబాబు నేరుగా మత రాజకీయాల జోలికి వెళ్లలేదు. చంద్రబాబు నాయుడే కాదు... జగన్ కూడా బీజేపీకి కావలసిన మనిషే. జగన్ ముఖ్యమంత్రిగా, చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఇద్దరూ కేంద్రం తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక బిల్లులన్నింటికీ మద్దతు ఇచ్చిన వారే. ఎవరు ఎక్కువ విధేయులో రుజువు చేసుకోవడానికి పోటీ ఉన్నట్టుంది. బీజేపీతో చంద్రబాబు దోబుచులాట కొత్తేమీ కాదు. బీజేపీతో చంద్రబాబు నాయుడు 1999, 2004, 2014, 2024లో పొత్తుతో ఎన్నికలు ఎదుర్కొన్నారు. 1999లో గెలిచారు. నాడు లోక్‌సభ స్పీకర్‌గా బాలయోగి పనిచేశారు. 2003 అలిపిరి ఘటనతో సానుభూతితో గెలుస్తామన్న ఆశతో ముందస్తుగా 2004లో బీజేపీ, టీడీపీ కలిసి పోటీ చేశాయి. అక్కడ బీజేపీ, ఇక్కడ టీడీపీ ఓటమి పాలైనాయి. దీంతో బీజేపీ నుంచి బాబు బయటికి వచ్చారు. తిరిగి 2014లో మళ్లీ పొత్తుతో పోటీ చేశారు. రెండుచోట్ల బీజేపీ, టీడీపీ గెలిచింది. అశోక్‌గజపతిరాజు, వై.సుజనా చౌదరి కేంద్రమంత్రులయ్యారు. ప్రత్యేక హోదా సాకుతో 2019 ఎన్నికలకు ముందు బీజేపీతో తెగతెంపులు చేసుకున్నారు. ఒంటరిగా పోటీ చేసి టీడీపీ ఓడిపోయింది. ఆ సమయంలో ప్రధాని మోదీని రాజకీయంగానే కాకుండా వ్యక్తిగతంగానూ చంద్రబాబు విమర్శించారు. గోద్రా అల్లర్ల సమయంలో మోదీని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్ వస్తే విమానం కూడా దిగకుండా తరిమికొడతామని చెప్పారు. 2024 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి పోటీ చేశాయి. కనీసం కమలం గుర్తు కూడా తెలియని ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ ఆరు ఎంపీ, 10 ఎమ్మెల్యే సీట్లలో పోటీచేసి మూడు ఎంపీ, 8 ఎమ్మెల్యే సీట్లు గెలుచుకున్నది. ఏపీ కేబినెట్లో బీజేపీకి ఒక మంత్రి పదవి, కేంద్రంలో టీడీపీకి రెండు మంత్రి పదవులు దక్కాయి. రాజకీయం చేయడానికి తిరుపతి లడ్డూ నిజంగానే లడ్డూలా దొరికింది. కల్తీ నిరోధానికన్నా రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యత కనిపిస్తోంది. ఏమైతేనేం ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి లేని ప్రాబల్యం సంపాదించి పెట్టడంలో చంద్రబాబు కృషి అపారం.

యూపీ ఉప ఎన్నికలకు పార్టీల సమాయత్తం

ప్రదీప్ కపూర్

ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఉప ఎన్నికల తేదీని ప్రభుత్వం ప్రకటించకపోయినప్పటికీ అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు పోటీలో పాల్గొనేందుకు రంగం సిద్ధంచేశాయి. ఖైర్ (ఎస్సీ), కర్హల్, మిల్కిపూర్, ఘజియాబాద్, కుందర్కి, సీషామౌ, కతేహ్రీ, ఫుల్పూర్, మజ్వా, మీరాపూర్ పది అసెంబ్లీ నియోజకవర్గాలలో జరిగే ఉప ఎన్నికల ఫలితాలే 2027లో జరిగే అసెంబ్లీ ఎన్నికల రాజకీయాన్ని నిర్దేశించనున్నాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ, సమాజ్‌వాదీ పార్టీ, బీఎస్పీ, కాంగ్రెస్ తమ అభ్యర్థుల గెలుపును సవాలుగా తీసుకుంటున్నాయి.

గత లోక్‌సభ ఎన్నికలలో యూపీలో వచ్చిన ఫలితాలతో దిమ్మతిరిగిన ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో సహా మొత్తం

సంఘ్ పరివార్ బృందాలు ఈ ఉప ఎన్నికలలో గెలుపునకు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. ఈ ఎన్నికలకు యోగి తన ప్రతిష్ఠను పణంగా పెట్టారని చెప్పవచ్చు. లోక్‌సభ ఎన్నికల్లో అయోధ్య, ఇతర ప్రాంతాలలో బీజేపీ అభ్యర్థుల ఓటమితో షాక్‌కు గురైన బీజేపీ అయోధ్యతో సహా ఇతర ప్రాంతాల్లో అభివృద్ధి ప్రణాళికను ప్రకటించింది. ఈ 10 అసెంబ్లీ స్థానాల ఉపఎన్నికల్లో విజయం సాధించేందుకు పర్యవేక్షణ నిమిత్తం సుమారు డజనుకు పైగా మంత్రులను కూడా ఆయా స్థానాల్లో నియమించారు. అభ్యర్థుల ఎంపిక, సన్నాహాల పర్యవేక్షణలో బీజేపీ నాయకత్వం, సంఘ్ పరివార్ పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉన్నాయి. నియోజకవర్గాల్లో సమన్వయం కోసం బీజేపీ, సంఘ్‌పరివార్ అనేక దఫాలు సమావేశాలు జరిపాయి. స్వయంగా యోగి ఎన్నికల ప్రచార నిర్వహణ పూర్తి బాధ్యత తీసుకున్నారు.

రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ సమాజ్‌వాదీ పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనారిటీలను తమ వైపు తిప్పుకోవడంలో నిమగ్నమయ్యారు. రాష్ట్రంలో పేలవమైన పాలన, శాంతిభద్రతల క్షీణత, బూటకపు ఎన్‌కౌంటర్లు, వెనుకబాటుతనం, ద్రవ్యోల్బణం, సమాజంలోని వివిధ వర్గాల్లో ముఖ్యంగా దళితులు, మైనారిటీల సమస్యల పట్ల ప్రభుత్వ ఉదాసీనత వంటి సమస్యలను అఖిలేశ్ యాదవ్ ప్రచారాస్త్రాలుగా వాడుకోనున్నారు. ముఖ్యంగా అఖిలేష్ తన ప్రచారంలో రాష్ట్ర ఆర్థిక సమస్యలు, పాలనా వైఫల్యాలపై ప్రధానంగా దాడి చేస్తున్నారు.

ఇండియా ఐక్య సంఘటనలో భాగస్వామ్య పార్టీలైన ఎస్పీ, కాంగ్రెస్ 10 అసెంబ్లీ స్థానాలకు జరగనున్న ఉప ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. పార్టీ అభ్యర్థులను పోటీలో నిలపాలనుకున్న ఐదు స్థానాలను ఇప్పటికే కాంగ్రెస్ గుర్తించింది. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ మధ్య సీట్ల పంపకంపై ఇప్పటి వరకు ఎలాంటి చర్చలు జరగనప్పటికీ సీట్లు, అభ్యర్థుల విషయంలో కసరత్తు జరుగుతోంది. రెండుపార్టీల మధ్య అవగాహన కుదురుతుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది.మరో పక్క ఎన్నికల ప్రచారాన్ని చేపట్టే వ్యక్తుల నియామకం కూడా జరిగింది.

యూపీ మాజీ ముఖ్యమంత్రి, బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి గత కొన్నేళ్లుగా ఓటింగ్ శాతం గణనీయంగా తగ్గడం, సీనియర్ నాయకులు, కార్యకర్తల ఫిరాయింపుల దృష్ట్యా తన పార్టీ మనుగడ, భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. గత లోక్‌సభ ఎన్నికల్లో అధ్వాన్నమైన పనితీరు కనబరిచిన బీఎస్పీ కనీసం ఖాతా కూడా తెరవలేకపోయింది. తాజాఎన్నికల నేపథ్యంలో బీఎస్పీ నేతలు, కార్యకర్తలు అనేకసార్లు సమావేశాలు నిర్వహించారు.

పార్టీ పుంజుకునేందుకు మాయావతి చాలాసార్లు ప్రయత్నించారు. ఆమె తన మేనల్లుడు ఆకాశ్ ఆనంద్‌ను నంబర్ టూ స్థానం నుంచి తొలగించారు. తిరిగి అదే స్థానంలోకి తీసుకురావలసిన పరిస్థితి వచ్చింది. దళితులు, మైనారిటీలపై సమాజ్‌వాదీ, కాంగ్రెస్ పార్టీ వివక్షత ప్రదర్శిస్తున్నాయని మాయావతి ఆరోపిస్తున్నారు. ఈ ఉప ఎన్నికలలో పాల్గొనడానికి సుముఖంగా లేకపోయినప్పటికీ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ దయనీయ పరిస్థితి దృష్ట్యా నూతన ఉత్తేజానికి ఈ ఉపఎన్నికలలో బీఎస్పీ పాల్గొనవలసి వస్తోంది. అయితే గత కొన్ని సంవత్సరాలుగా బీఎస్పీ నుంచి దళిత నాయకులు, కార్యకర్తలను తమ పార్టీలోకి రాబట్టుకోవడంలో సమాజ్‌వాదీ పార్టీ, కొంత వరకు కాంగ్రెస్ సఫలీకృతమయ్యాయని చెప్పవచ్చు.

నాలుగు కార్మిక కోడ్‌లను ఉపసంహరించాల్సిందే!

వెలుగూరి రాధాకృష్ణమూర్తి

దేశంలోని 90 కోట్లమంది కార్మికుల్ని కట్టుబానిసలుగా మార్చే నాలుగు కార్మిక కోడ్‌లను తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్‌చేస్తూ సెప్టెంబర్ 23వ తేదీన కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 'బ్లాక్ డే' నిర్వహించారు. ఈ కార్యాచరణలో దేశమంతటా దాదాపు 20 కోట్లమందికి పైగా కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు. 1917లో సోవియట్ యూనియన్‌లో కమ్యూనిస్టుపార్టీ ప్రభుత్వం ఏర్పాటు, 1919లో ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్ (ఐఎల్ఓ) ఉనికిలోకి రావడంతో అనేక దేశాలలో కార్మికులకు కొన్ని రాయితీలు ఇవ్వటం ప్రారంభమైంది. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో కార్మికవర్గం కీలకమైన పాత్ర పోషించింది. అందువల్ల రాజ్యాంగంలో 39, 41, 43, 43 ఏ, తదితర అధికరణాలు, ఐఎల్ఓ చేసిన సిఫారసులు సుప్రీంకోర్టు తీర్పులు అన్ని కలిసి కార్మిక చట్టాలకు ప్రేరణగా నిలిచాయి. అంతేగాక, కార్మిక ప్రయోజనాల రక్షణ "రాజ్యం విధి"గా కూడా గుర్తించారు.

కార్మిక చట్టాల లక్ష్యాలు: పెట్టుబడి, శ్రమకు మధ్య సమస్యలపై ఒత్తిడి పెంచారు. నిజానికి, చట్టాలు మార్చటం అవసరమా? మొత్తం శ్రామిక శక్తిలో 93శాతం అసంఘటితులు, 7శాతం సంఘటితులు ఉన్నారు. ప్రతి 1000 మందిలో స్వయం ఉపాధి కార్మికులు 439 మంది, వేతన కార్మికులు 168 మంది, క్యాజువల్ లేదా దినసరి కూలీలు 393 మంది ఉన్నారు. వీరిలో చట్టాలు వర్తించేది ప్రతి 1000 మందిలో కేవలం 168 మందికి మాత్రమే. మిగిలిన వారికి ఏ చట్టాలు వర్తించవు. అంతేగాక, ప్రత్యేక ఆర్థిక మండళ్లు (ఎస్ఈజెడ్‌లు), స్టార్టప్ సంస్థలు, ఐటీ పరిశ్రమలకు కార్మిక చట్టాల నుంచి మినహాయింపు ఇస్తున్నారు. మరి వెయ్యి మంది కార్మికులలో 168 మందికి మాత్రమే వర్తించే చట్టాలలో మార్పులు తీసుకురావాలని పెట్టుబడిదారీ వర్గం డిమాండ్ చేస్తోంది. దేశంలోని పెట్టుబడిదారీ వర్గంచేస్తున్న డిమాండ్ మేరకు 1999వ సంవత్సరంలో రవీంద్ర వర్మ అధ్యక్షులుగా 'నేషనల్ లేబర్ కమిషన్'ను వాజపేయి ప్రభుత్వం నియమించింది. ఈ కమిషన్ 2002 జూన్‌లో తన నివేదికను సమర్పించింది. కార్మిక చట్టాల సంఖ్యను కుదించాలని, కఠినతర నిబంధనలను సడలించాలని, పెట్టుబడిదారీ వర్గానికి అనుకూలంగా కార్మిక చట్టాలను సంస్కరించాలని రవీంద్ర వర్మ కమిషన్ సిఫారసు చేసింది. కార్మికవర్గ ప్రతిఘటన, రాజకీయ అనివార్యతల కారణంగా ఈ సిఫార్సులు అమలుకు వాజ్‌పేయి ప్రభుత్వం వెనుకంజ వేసింది. కానీ 2000లో ఎఫ్‌టిఈ (ఫిక్స్‌టెరం ఎంప్లాయ్ మెంట్) నిబంధనలను ఫ్యాక్టరీస్ చట్టంలో చేర్చింది. అంటే ఉద్యోగం ఇచ్చిన రోజే ఎప్పుడు తీసేసేది తెలియజేస్తారు. ఇది ఒక కొత్త తరహా శ్రమదోపిడి పద్ధతి. ఫ్యాక్టరీస్ చట్టం నిబంధనల ప్రకారం యాజమాన్యాలు కార్మికశాఖకు పీరియాడికల్‌గా రికార్డులు, నివేదికలు సమర్పించాల్సి ఉండేది. మోదీ అధికారంలోకి రాగానే 2014 డిసెంబర్‌లో ఈ నిబంధనలను రద్దుచేసి, "ఇన్‌స్పెక్టర్ రాజ్ " నుంచి పెట్టుబడిదారీవర్గ "విముక్తి" కి పూనుకున్నాడు. ఇది ఐఎల్ఓ నిబంధన 81 కి విరుద్ధం. ఈ నిబంధనలు అమలులో ఉన్న సమయంలోనే లక్షకు పైగా సంస్థలు ఎటువంటి నివేదికలు సమర్పించేవి కావు. అప్పుడు అది చట్ట విరుద్ధం. ఇప్పుడు దానినే మోదీ చట్టసమ్మతం చేశారు. మోదీ రాకతో మొత్తం కార్మిక రంగ స్వభావమే మారిపోయింది. మొత్తం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక కోడ్‌లను తీసుకువచ్చారు. వీటిపై సమతుల్యత సాధించటం, సమానత్వ సూత్రంపై పారిశ్రామిక సంబంధాల నిర్వహణ, పారిశ్రామిక ప్రజాస్వామ్య అభివృద్ధి తదితర అంశాలు పరిగణనలోకి తీసుకుని కార్మికచట్టాలు చేశారు. స్వాతంత్ర్యానికి ముందు, తర్వాత కార్మిక చట్టాలను పరిశీలిస్తే ఆర్థిక దోపిడీ

నిర్మూలన, కక్షసాధింపు, వేధింపుల నుంచి రక్షణ, అందరికీ సామాజిక సంక్షేమ పథకాలు అమలులాంటి లక్ష్యాలు వాటిలో మనకు స్పష్టంగా బోధపడగలవు. భారత రాజ్యాంగంలో సామాజిక సంక్షేమం, కార్మిక ప్రయోజనాల రక్షణలు పొందుపరిచారు.

ఉద్యోగ, ఉపాధుల స్వభావం, యాజమాన్యాల మానసిక పరిస్థితి, రాజ్యాంగం తాత్వికత, న్యాయ వ్యవస్థల జోక్యం, ప్రభుత్వాల ప్రవృత్తి, కార్మిక సంఘాల శక్తిసామర్థ్యాలు తదితర అంశాలపై ఆధారపడి కార్మిక చట్టాలు వచ్చాయి. యజమానులు అనుసరించిన ఏకపక్ష, నిరంకుశ విధానాలు కార్మికచట్టాల పటిష్ఠతను నిర్దేశించాయి. లాభాపేక్ష, అత్యాశల కారణంగానే ఈ చట్టాలు కఠినంగా ఉన్నాయని యాజమాన్యాలు, పెట్టుబడిదారులు భావించారు. అందుకేవారు "ఇన్‌స్పెక్టర్ రాజ్" నుంచి విముక్తి కావాలని కోరారు. కార్మిక చట్టాలను సమూలంగా మార్చాలని ప్రభుత్వాధిత "స్టేక్ హోల్డర్స్" తో సంప్రదింపులు జరపలేదు. పార్లమెంటులో సైతం చర్చ జరగకుండానే హడావిడిగా ఆమోదింప చేసుకున్నారు. అత్యంత జరూరుగా రాష్ట్రపతి ఆమోదం లభించింది. ఈ కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా యావత్ కార్మికవర్గం, ఉద్యోగవర్గాలు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున సమ్మెలు, ప్రదర్శనలు ధర్నాలు, ర్యాలీలు, "మహాపడావ్"లు, పార్లమెంటు ముట్టడులు నిర్వహించాయి. ఒక రోజు, రెండు రోజుల దేశవ్యాప్త సమ్మెలు జరిగాయి. గత పది సంవత్సరాలుగా జరుగుతున్న ఈ నిరసన ఉద్యమాలను ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నది. 2024 ఎన్నికల అనంతరం తిరిగి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం నాలుగు కార్మిక కోడ్‌ల అమలుకు పూనుకుంది.

వేతన కోడ్: అమలులో గల మూడు కార్మిక చట్టాలను రద్దుచేసి "వేతన కోడ్"ను ఏర్పాటు చేశారు. కనీస వేతనాలు ఉండవు. ద్వైపాక్షిక సంప్రదింపులు లేవు. కార్మికశాఖ పూర్తిగా నిర్వీర్యం అయింది. దాని స్థానంలో ఎటువంటి అధికారాలులేని "ఫెసిలిటేటర్" ను నియమిస్తారు. చట్టాలను అమలుజరిపే యంత్రాంగం ఉండదు. కనీస వేతన సలహా మండళ్లు ఒక ఫార్స్‌గా తయారవుతాయి. కేంద్రం నిర్ణయించిన కనీస వేతనానికి మించి ఏ రాష్ట్రంలో కూడా కనీస వేతనాలు ఉండకూడదు. బోనస్, పీఎఫ్, గ్రాట్యుటీ చట్టాలన్నీ నీరు గార్చారు. కార్మికుల గోడు వినేవాడు గానీ తీర్చేవాడు గానీ ఉండరు.

ఇండస్ట్రియల్ రిలేషన్ కోడ్: అమలులో గల మూడు చట్టాలను రద్దుచేసి ఈ "కోడ్" ను తీసుకువచ్చారు. యూనియన్లను పెట్టుకోవడంగానీ, రిజిస్ట్రేషన్లు చేయించడంకానీ అసాధ్యం అవుతుంది. ఒక సంస్థలో 300 మంది కార్మికులు ఉంటేనే "స్టాండింగ్ ఆర్డర్స్" వర్తిస్తాయి. తద్వారా కార్మికులను తొలగించడం చాలా సులభతరం చేశారు. గతంలో ఈ సంఖ్య 100 మంది కార్మికులకు పరిమితమై ఉండేది. కార్మిక సంఘాల ఆఫీస్ బేరర్స్‌గా బయటివారు ఉండటాన్ని నిషేధించింది. సమ్మెచేయటం అసాధ్యంగా చేసింది. సమ్మెలను "చట్టవిరుద్ధం" అని ప్రకటించే ప్రక్రియను సులభతరం చేశారు. ఇది రాజ్యాంగ విరుద్ధం. ట్రేడ్ యూనియన్లలో సభ్యులు కాని వారికి ప్రత్యేకమైన ప్రోత్సాహకాలు ఉన్నాయి. కార్మిక సంఘాల మధ్య తలెత్తే వివాదాలను చట్టం పరిధిలోకి తీసుకువచ్చారు. ప్రభుత్వ అనవసర జోక్యానికి తెరలేపారు. "అసంఘటిత రంగ" నిర్వచనం సమగ్రంగా లేదు. ప్రస్తుతం 20 మంది కార్మికుల్ని కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించే కాంట్రాక్టరుకు లేబర్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. ఇప్పుడు ఆ సంఖ్యను 40కి పెంచారు. ఏ లైసెన్సు లేకుండానే 40 మంది కార్మికుల్ని కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించుకునే వెసులుబాటు కాంట్రాక్టరుకు కల్పించారు. సామాజిక భద్రతా కోడ్: అమలులోగల తొమ్మిది కార్మిక చట్టాలను రద్దుచేసి "సోషల్ సెక్యూరిటీ కోడ్"ను తీసుకొచ్చారు. సర్వజనీన సామాజిక భద్రత రాజ్యాంగ హక్కు. కానీ దీనిని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. సామాజిక భద్రత కవరేజ్ కోసం నిధులకు సంబంధించిన పూసేలేదు. కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి ఖర్చు చేసుకునేందుకు ఎటువంటి నిబంధనలు లేవు. నిర్మాణరంగ కార్మికులకు 1996 చట్టం, 2006 చట్టాలు ఉన్నాయి.ఆ చట్టాలలోని ప్రయోజనాలన్నిటినీ విస్మరించారు. అసంఘటితరంగ కార్మికులకు సామాజిక భద్రత కవరేజ్‌ని తప్పనిసరి చేయగల నిబంధనలు ఏమీలేవు. ఈ కోడ్‌ను అమలు జరపాల్సిన యంత్రాంగానికి ఎటువంటి అధికారాలను ఇవ్వలేదు. సర్వజనీన సామాజిక భద్రత రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ లింకేజీని తప్పనిసరి చేశారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి కార్మికులకు అసాధ్యం అయ్యే పరిస్థితి ఏర్పడింది.

ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్: పని ప్రదేశాలలో కార్మికుల "భద్రత" ఈ కోడ్‌లో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. గతంలో ఉన్న అనేక సౌకర్యాలు రద్దు చేశారు. కార్మికులు పనిచేసే పని ప్రదేశాలలో ఏది "ప్రమాదకరం" ఏది "అనారోగ్యకరం" అనే విషయాలపై నిర్వచనాలు స్పష్టంగా లేవు. ఫార్మా కంపెనీలలో ఇటీవల జరుగుతున్న ప్రమాదాలను గమనిస్తే, ఈ "కోడ్" ఎందుకూ కొరగానిదిగా ఉండిపోతుంది. ఈ కార్మిక కోడ్‌లు అమల్లోకి వస్తే, మహిళా కార్మికులతో రాత్రులు కూడా పని చేయించుకోవచ్చు. 12గంటల పని విధానాన్ని అమలు జరుపుకోవచ్చు. పర్మినెంట్ ఉద్యోగాల సంఖ్యను గణనీయంగా తగ్గించుకోవచ్చు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, ఎఫ్‌టిఈ, అప్రెంటీస్, నీమ్, దినసరి తదితర పద్ధతుల ద్వారా కార్మికుల సంఖ్యను గణనీయంగా పెంచుకోవచ్చు. తద్వారా అతి తక్కువ వేతనాలకు కార్మికుల్నిపెట్టుకుని శ్రమ దోపిడీకి పాల్పడవచ్చు. "హైర్ అండ్ ఫైర్" పద్ధతిని యదేచ్ఛగా అమలు జరుపుకోవచ్చు. గతంలో గల కార్మిక శాఖ, లేబర్ కోర్టులు, ట్రిబ్యునళ్లు, ఏవీ ఉండే అవకాశంలేదు. చట్టప్రకారం కార్మికులకు రావలసిన బకాయిలను రాబట్టుకోవడానికి న్యాయస్థానాల చుట్టూ తిరగాల్సి ఉంటుంది. ద్విపక్ష సంప్రదింపులు ఊసే ఉండదు. ఒక్క మాటలో చెప్పాలంటే కార్మికుల్ని కట్టుబానిసలుగా మార్చడానికి ఈ నాలుగు కార్మిక కోడ్‌లను తీసుకువచ్చారు. రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత: కార్మిక రంగం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి జాబితాలో ఉంది. కార్మిక కోడ్‌లను అమలు జరపాలంటే రాష్ట్ర ప్రభుత్వాల అంగీకారం అవసరం. వీటిని అమలు జరపాలని అనుకునే రాష్ట్ర ప్రభుత్వాలు తగిన నిబంధనలను తయారుచేయాల్సి ఉంది. బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు మినహా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికకోడ్‌లను అమలు జరపటానికి ఆసక్తి చూపటంలేదు. కార్మిక హక్కుల్ని హరించే కార్మిక కోడ్‌లను తమ ప్రభుత్వం అమలుజరపదని కేరళ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. తాము అధికారంలోకి వస్తే కార్మిక ప్రయోజనాలను కాపాడతామని వాగ్దానంచేసి అధికారంలోకి వచ్చిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కార్మిక కోడ్‌లను అమలు జరపరాదు. కార్మిక కోడ్‌ల ఉపసంహరణకోసం కార్మిక వర్గం యావత్తు తన ప్రతిఘటనను ముమ్మరం చేయాలి.

సెల్: 9490193263

'దేశ భక్తులు' చరిత్ర తెలుసుకోవాలి

డాక్టర్ దేవరాజు మహారాజు

భగత్‌సింగ్ వర్ధంతి నాడో జయంతి నాడో ఆయన విగ్రహానికో, పటానికో ఒక పూలదండ వేసి పెట్టడం తప్ప జనం ఆయన గురించి తెలుసుకునే ప్రయత్నం చేయరు. నాయకులు అసలే చేయరు. భగత్‌సింగ్ చేసిన త్యాగం గురించి ఆయన ఆలోచనల గురించి, అభిప్రాయాల గురించి ఏ మాత్రం తెలుసుకోరు. ఆయన మనకు ఎందుకు ఆదర్శప్రాయుడో ఆలోచించరు. లెనిన్ మహాశయుడు ఆయనకు ఎలా స్ఫూర్తినిచ్చాడో తెలుసుకోరు. లెనిన్ విగ్రహాలు పడగొట్టటం, విదేశీయుల విగ్రహాలు మనకెందుకు అనడం, వాళ్లేదో పెద్ద దేశభక్తులైనట్టు, మిగతావారంతా దేశ ద్రోహులన్నట్టు చిత్రమైన సంభాషణలు, చర్చలు జరుగుతూ ఉంటాయి. మరి ఈ 'దేశభక్తులు' దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎందుకు పాల్గొనలేదో సమాధానం చెప్పరు. దేశభక్తి గురించి తమకే పేటెంట్ హక్కున్నట్టు అందరికీ స్పెషల్‌క్లాసు పెడతారు. ఉరికంబమెక్కడానికి ఐదునిముషాల ముందు దాకా భగత్‌సింగ్ చేతిలో లెనిన్ రాసిన పుస్తకముంది. దాన్నే ఆయన చదువుతూ ఉన్నాడు. పాపపుణ్యాల గూర్చి, పునర్జన్మల గూర్చి ఆలోచిస్తూ సమయం వృథా చేసుకోలేదు. ఎంతో ఆత్మ విశ్వాసంతో మృత్యువును ఎదుర్కోబోతూ కూడా సోషలిస్ట్ భావాలలో మునిగి తేలాడు. దేశ స్వాతంత్ర్యం కోసం చిరునవ్వుతో ఉరికంబమెక్కిన షహీద్ భగత్‌సింగ్ ఆలోచనలు ఎలా ఉండేవో చూద్దాం! సర్వ శక్తిమంతుడని చెబుతున్న పరమాత్మ అస్తిత్వాన్ని నేను తృణీకరి స్తున్నాను. నేను అహంకారిని, నిరర్థకుణ్ణి, పాపాత్ముణ్ణి కాదు. కాబట్టే- నాస్తికుణ్ణయ్యాను. నేను దేవుణ్ణి కాదు, దేవదూతనూ కాదు. అలాగని అవతారాన్ని కాదు. నా జీవితాన్ని ఒక ధ్యేయం కోసం, దేశంకోసం సమర్పించబోతున్న ఒక సామాన్య పౌరుణ్ణి! ఇంతకన్నా గొప్ప ఆశయం ఇంకా వేరే ఏముంటుందీ? ఉరితాడు మెడకు బిగుసుకుంటుండగానే, నా కాళ్ల కింది నుంచి పీట పక్కకు తొలగిపోతుంది. అదేనాకు అంతిమ క్షణమని తెలుసు. ఏ స్వార్థ భావనా లేకుండా, నా జీవితాన్ని స్వేచ్ఛగా దేశ స్వాతంత్ర్యానికి అర్పిస్తున్నాను. ఇది పాప పుణ్యాలకు గత జన్మలకు, దైవభక్తికి, భయానికీ అతీతమైంది. ఒక దేశ భక్తుడిగా నా స్వభావ సిద్ధమైన ధ్యేయం. నేను హేతుబద్ధంగా ఆలోచించే మంచి మనిషినని తెలిసినా, హృదయం ఉన్నవాడినని తెలిసినా, కేవలం దేవుణ్ణి కాదన్నందుకే సమాజమంతా నాకు వ్యతిరేకంగా మారిపోయింది. కొంచెం ఆధ్యాత్మిక ఆలోచనల్ని, కొంచెం మానవ సెంటిమెంటును కలిపి, గొప్ప సాహిత్యాత్మక భావనల్ని ప్రకటించొచ్చు. కానీ, నేను ఆపని చేయను. మానవవాదిగా, యదార్థవాదిగా వాస్తవాన్ని ఉన్నది ఉన్నట్టుగా స్వీకరించగల మనోధైర్యం ఉన్నవాణ్ణి. ఆ ధైర్యంతోనే ఇంతదాకా వచ్చాను. ఆ ధైర్యాన్నే నా ముందు తరాలకు అందించదలిచాను. నిరంతరం ప్రయత్నిస్తూ ఉండడమే గొప్ప విజయం. ముందుకు పోదలచిన వాడు ఎవడైనా సరే, పనికిరాని పాత విలువల్ని, నమ్మకాల్ని, సంప్రదాయాల్ని, సంస్కృతుల్ని ప్రశ్నిస్తూ రావాలి! ఆ పని చేయకుండా కళ్లు మూసుకుని నమ్ముతూ రావడం మూర్ఖుల లక్షణం. తెలివైన ఆధునిక మానవుడి విధానం అలా ఉండకూడదు. తనను యదార్థవాదిగా ప్రకటించుకునేవాడు ఎవడైనా సరే- మూఢనమ్మకాలను వదిలించుకుని బయటికిరావాలి. తర్కానికున్న విలువను, వెలుగును గుర్తించని వాడు గుడ్డివాడే కదా? ఇంగ్లీషువాడు భారతదేశాన్ని ఎందుకు పరిపాలించాడు? దేవుడు



కోరుకున్నందు వల్లనో, దైవాజ్ఞ వల్లనోకాదు. దేవుడి కృపాకటాక్షాలు ఇంగ్లీషు వాడికి ఉన్నందువల్లనో, భారతీయులకు లేనందువల్లనో కాదు. ఇంగ్లీషువాడు శక్తిమంతుడు. యుక్తిమంతుడూ గనుక. పరిపాలనానుభవం ఉన్నవాడు గనుక. మిలటరీ బలగాలు, ఆయుధాలు సమృద్ధిగా ఉన్నవాడు గనుక. భారతీయుల్ని లాఠీలతో కొట్టి, తుపాకులతో కాల్చి వారిపై పెత్తనం చలాయించాడు తప్పితే, ఇందులో ఏ దేవుడి ప్రమేయం లేదు. నా మిత్రు డొకడు నన్ను ప్రార్థన చేసుకొమ్మని సలహా ఇచ్చాడు. నేను నాస్తికుడిని, మానవవాదినని నిర్భయంగా చెప్పినపుడు అతనన్నాడు- "నీ చివరి రోజులు దగ్గరపడ్డప్పుడు నీకు తెలిసొస్తుందిలే"- అని! అప్పుడు నేనన్నాను- ప్రియమిత్రమా! గుర్తుపెట్టుకో. అలాంటి పని నేనెప్పుడూ చేయను. అలా చేయడం నా దృష్టిలో నైతికంగా దిగజారడం- నాలో ఏవో కోరికలు పెట్టుకుని, అవి తీర్చమని నేను, లేని దేవుడితో లాలూచీపడను- అని చెప్పాను. ఇదీ భగత్‌సింగ్ ఆలోచనా ధోరణి. భగత్‌సింగ్, ఆయన అనుచరులు 1930 జనవరి 21న కోర్టులో విచారణ ఎదుర్కొంటూ కూడా లెనిన్ జన్మదినంనాడు మాస్కోకు టెలిగ్రాం పంపారు. లెనిన్ ఆశయాలను ముందుకు తీసుకుపోతున్న వారందరికీ అభినందనలు. రష్యాలో జరుగుతున్న సోషలిస్ట్ ప్రయోగం విజయవంతం కావాలి. అంతర్జాతీయ కార్మికోద్యమంలో మేమూ గళం కలుపుతాం- అది ఆ టెలిగ్రాం సారాంశం! ఈ విషయాలేవీ నేటి కుహనా దేశభక్తులకు తెలియవు... తెలుసుకునే ప్రయత్నం కూడా చేయరు. పాతికేళ్లకు కొంచెం ఇటూ అటూగా ఉన్న నాటి యువకులంతా ఆ రోజుల్లో లెనిన్ ప్రభావంలో ఎంతగా పడిపోయారంటే - హిందుస్థాన్ రిపబ్లిక్ అసోసియేషన్‌కు సోషలిస్ట్ పదం కూడా చేర్చి, 'హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్' గా మార్చుకున్నారు. 1917 లో జరిగిన అక్టోబర్ సోషలిస్ట్ విప్లవ ప్రభావంతో ఒక నిబంధనావళి రూపొందించి దాన్ని దేశమంతటా పంచిపెట్టే కార్యక్రమం చేపట్టారు. ముఖ్యంగా ఇది ఉత్తరప్రదేశ్‌లో ఉధృతంగా జరిగింది. భారతీయ యువరక్తానికి ఆనాడు లెనిన్ స్ఫూర్తిదాత కాకపోతే అలాంటి కార్యక్రమాలు జరిగి ఉండేవికావు. నాటి యువకులే కాదు, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రభుత్వాన్ని నడిపిన తొలితరం నాయకులు లెనిన్ శత జయంతి సందర్భంగా 35 లక్షల తపాలా బిళ్లల్ని విడుదలచేసి, ఘనంగా నివాళులర్పించారు. ఆయన మీద ఎంత గౌరవభావ ముంటే ఆనాటి ప్రభుత్వం ఆ పని చేసింది? అంతేకాదు, సోవియట్ యూనియన్ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో కూడా భారత ప్రభుత్వం 30 వేల తపాలా బిళ్లల్ని విడుదల చేసింది. రెండు దేశాల మధ్య మైత్రీ సంబంధాలు ఎంత గాఢంగా ఉంటే అట్లా చేస్తారూ? తెలియని 'దేశభక్తులు' కొంచెం వెనక్కి వెళ్లి చరిత్ర తెలుసుకోవాలి! సరే, తర్వాత కాలంలో ఈ ఉభయ దేశాల్లోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. అది వేరే విషయం. లెనిన్ సారథ్యంలోని సోషలిస్టు రష్యాను మన విశ్వకవి రవీంద్రుడు ఒకసారి సందర్శించి, ఉబ్బితబ్బిబ్బయ్యారు. లెనిన్ స్ఫూర్తి తక్కువది కాదుగదా? మందబుద్ధులకు ఇవన్నీ ఎలా అర్థమవుతాయీ? అంతే కాదు, భారతదేశాన్ని వైజ్ఞానిక భారతంగా తీర్చిదిద్దాలని దాదాపు అన్ని జాతీయ పరిశోధనా సంస్థలు ప్రారంభించిన భారత తొలి ప్రధాని పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ కృషి తక్కువగా చూపాలని, ఆయన స్థాయిని తగ్గించి చూపాలని చూసిన ఈ మందబుద్ధుల స్థాయి ఏమిటో వివేచన గల సామాన్య జనానికి తెలుసు. ఆనాడు లెనిన్ నాయకత్వంలోని ప్రభుత్వం ఈ దేశానికిచ్చిన స్ఫూర్తి, శాస్త్ర సాంకేతిక సహకారం చాలా గొప్పది. ఆయా రంగాల్లో మన దేశం ప్రపంచంలో ఈనాడు తలెత్తుకుని నిలబడగలుగుతూ ఉందంటే- అప్పుడు అందిన స్ఫూర్తి కూడా ఒక కారణం. ఈ అవుపేడ టీమ్ 70 యేళ్ల క్రితమే అధికారంలోకి వచ్చిఉంటే- ఈ దేశ వాసులంతా రాముడు, కృష్ణుడు అనే కల్పిత పాత్రల్ని వెతుక్కుంటూ అడవుల్లో ఇంకా అనాగరికంగానే తిరుగుతూ ఉండేవారు. హమ్మయ్య! పెద్ద ప్రమాదం తప్పింది. సమకాలీనంలో జరిగిన, జరుగుతున్న తప్పిదాలను సంయమనంతో, చిత్తశుద్ధితో సవరించుకునే మనోధైర్యం, సాహసం ఈ దేశ ప్రజలకు ఉంది. తమకు తాము దేశ భక్తులమని ప్రకటించుకునే ఈ సనాతన సంప్రదాయవాదుల్లోంచి ఇంతవరకు భగత్‌సింగ్ లాంటి త్యాగశీలి ఒక్కరైనా ఎందుకు ఉద్భవించలేదన్నది ప్రశ్న! కేవలం అది, అడ్డుగోడలు ఎరగని స్వేచ్ఛాలోచనాపరుడితోనూ, నాస్తికుడితోనూ, మానవవాదితో మాత్రమే సాధ్యమవుతుందన్నది గుర్తెరగాలి! 1931 మార్చి 23న భగత్‌సింగ్ తన 23 వ యేట దేశం కోసం ఉరికంబమెక్కారు.

-కేంద్రసాహిత్య అకాడెమీ అవార్డు విజేత, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్

బెంగళూరు 'తాజ్'కు బాంబు బెదిరింపు

బెంగళూరు: కర్నాటక రాజధాని బెంగళూరులోని ప్రముఖ తాజ్ వెస్ట్ ఎండ్ హోటల్‌కు బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. గుర్తుతెలియని వ్యక్తులు ఈ- మెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బెంగళూరులోని రేస్‌కోర్స్ ప్రాంతంలోని తాజ్ వెస్ట్ ఎండ్ హోటల్‌లో రాజకీయ నాయకులు, క్రికెటర్లు, ప్రముఖులు బస చేస్తుంటారు. ఈ ప్రముఖ హోటల్‌కు శనివారం బాంబు బెదిరింపులు వచ్చాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఈ- మెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, బాంబుస్క్వాడ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని తనిఖీలు చేపట్టారు. అప్రమత్తమైన పోలీసులు హోటల్ వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇప్పటివరకు ఎలాంటి అనుమానాస్పద వస్తువును గుర్తించలేదు. దీనిపై విచారణ జరుగుతోందని అధికారులు వెల్లడించారు.

గడువులోగా మహారాష్ట్ర ఎన్నికలు
ఏర్పాట్లపై కేంద్ర ఎన్నికల సంఘం సమీక్ష

ముంబై: నవంబరులో మహారాష్ట్ర అసెంబ్లీ గడువు ముగుస్తున్నందున అక్టోబరులో ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందులో భాగంగా మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేపట్టింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ శనివారం ఇక్కడ అసెంబ్లీ ఎన్నికలపై సమీక్షించారు. ఆయనతో పాటు ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, ఎస్ఎస్ సంధు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీ, మున్సిపల్ కమిషనర్లు, డివిజనర్ కమిషనర్లు, ప్రభుత్వ సీనియర్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో లోక్‌సభ ఎన్నికల సమయంలో చోటుచేసుకున్న ఎన్నికల నేరాలపై విచారణను వేగవంతం చేయాలని రాష్ట్ర పోలీస్ అధికారులను రాజీవ్ కుమార్ ఆదేశించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఎన్నికల తేదీలపై అడిగిన ప్రశ్నలకు రాజీవ్ కుమార్ సమాధానమిస్తూ... మహారాష్ట్రలోని 288 నియోజకవర్గాల్లో 25 ఎస్సీ, 29 ఎస్టీ నియోజకవర్గాలు ఉన్నట్టు చెప్పారు. ప్రస్తుత మహారాష్ట్ర అసెంబ్లీ గడువు నవంబర్ 26వ తేదీతో ముగుస్తుందని, అందువల్ల ఆ తేదీకి ముందే ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంటుందని వివరించారు. రాష్ట్రంలో మొత్తం 9.59 కోట్ల మంది అర్హులైన ఓటర్లు ఉన్నారని, వారిలో 4.59 కోట్ల మంది పురుషులు, 4.64 కోట్ల మంది స్త్రీలు ఉన్నట్టు చెప్పారు. తొలిసారి ఓటు హక్కు పొందిన 18-19 వయసు గల యువత సంఖ్య ప్రోత్సాహకరంగా ఉందని, వీరు సుమారు 19.48 లక్షల వరకూ ఉంటారని చెప్పారు. నవంబర్ 26వ తేదీతో అసెంబ్లీ గడువు ముగియనుందని ఈసీ వివరించిన నేపథ్యంలో అక్టోబర్‌లో ఎన్నికలు ఉంటాయని, రెండు విడతల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

నిర్మలా సీతారామన్‌పై కేసు

బెంగళూరు: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌పై కేసు నమోదు చేయాలని బెంగళూరు ప్రత్యేక కోర్టు ఆదేశించింది. ప్రస్తుతం రద్దయిన ఎన్నికల బాండ్ల పేరిట మోసానికి పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని బెంగళూరు చట్టసభల ప్రతినిధుల న్యాయస్థానం తిలక్‌నగర్ పోలీసులను ఆదేశించింది. చాలామంది పారిశ్రామికవేత్తలను సీతారామన్ బెదిరించి బీజేపీకి నిధులు వచ్చేలా చేశారని జనాధికార సంఘర్షపరిషత్తుకు చెందిన ఆదర్శ్ గతంలో తిలక్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించగా... ఫిర్యాదు స్వీకరించలేదు. దీంతో ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి సంతోశ్ గజానన ధర్మాసనం... సీతారామన్‌పై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. తదుపరి విచారణ అక్టోబరు పదో తేదీకి వాయిదా వేశారు. ఆమెతోపాటు ఎఫ్ఐఆర్‌లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కర్నాటకకు చెందిన బీజేపీ నేతలు నలీన్ కుమార్ కటీల్, బీఐ విజయేంద్ర పేర్లను కూడా చేర్చారు.

నలుగురు కుమార్తెలను చంపి... తండ్రి ఆత్మహత్య

న్యూఢిల్లీ: ఒక వ్యక్తి, అతడి నలుగురు కుమార్తెలు ఇంట్లో శవాలై కనిపించారు. ఆ వ్యక్తి తన కుమార్తెలను హత్య చేసిన తర్వాత విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ మరణాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దేశ రాజధాని దిల్లీలో ఈ ఘటన జరిగింది. రంగ్‌పురి ప్రాంతంలోని అద్దె ఇంట్లో నివసిస్తున్న ఒక వ్యక్తి... అతడి నలుగురు కుమార్తెలు సెప్టెంబర్ 24 నుంచి బయటకు రాలేదు. తలుపులు మూసి ఉన్న ఆ ఇంటి నుంచి దుర్వాసన రావడాన్ని యజమాని శుక్రవారం గుర్తించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఇంటి వద్దకు చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది సహాయంతో తలుపులు తెరిచి లోనికి వెళ్లారు. కార్పెంటర్‌గా పనిచేసే 46 ఏళ్ల హీరాలాల్ శర్మ ఒక గదిలో, అతడి కుమార్తెలైన 26 ఏళ్ల నీతు, 24 ఏళ్ల నిక్కి, 23 ఏళ్ల నీరూ, 20 ఏళ్ల నిధి మరో గదిలో మరణించి ఉండటాన్ని చూశారు. కుమార్తెల నడుము, మెడకు ఎర్రటి దారం కట్టి ఉన్నట్లు గమనించారు. మరోవైపు మూడు ప్యాకెట్ల విషం, ఐదు గ్లాసులు, అనుమానాస్పద ద్రవంతో కూడిన చెంచా ఆ ఇంట్లో కపిపించాయని పోలీసులు తెలిపారు. తండ్రి మొదట ఆడ పిల్లలకు విషం ఇచ్చి చంపి... ఆ తర్వాత విషం సేవించి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. ఏడాది కిందట కేన్సర్‌తో భార్య చనిపోవడంతో హీరాలాల్ అప్పటి నుంచి కుటుంబాన్ని సరిగా పట్టించుకోవడం లేదని పొరుగువారు పోలీసులకు తెలిపారు. అనారోగ్యంతో ఉన్న కుమార్తెలకు చికిత్స కోసం ఆసుపత్రుల చుట్టూ అతడు తిరిగినట్లు బంధువులు చెప్పారు.

నగదుతో దొంగలు పరారీ

చెన్నై: ఏటీఎంలు పగలగొట్టి అందులోని నగదు కొల్లగొట్టి కంటైనర్‌లో పరారవుతున్న దొంగలను పోలీసులు వెంటాడి పట్టుకున్నారు. ఈ సందర్భంగా దొంగలు, పోలీసుల మధ్య జరిగిన కాల్పుల్లో ఒక దొంగ మరణించగా... మిగతా దొంగలతోపాటు పోలీసులకు సైతం గాయాలయ్యాయి. ఈ ఘటన తమిళనాడులో చోటు చేసుకుంది. కేరళ త్రిసూర్‌లోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ ఏటీఎంలు పగులగొట్టి సుమారు రూ.60 లక్షలకు పైగా నగదు చోరీ జరిగినట్లు తెలిసింది. అయితే దొంగలు... కంటైనర్‌లో నగదుతో పరారవుతున్నట్లు తమిళనాడులోని నమక్కల్ జిల్లా పోలీసులకు సమాచారం అందించింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆ కంటైనర్‌ను నిలువరించేందుకు ప్రయత్నించారు. కంటైనర్ డ్రైవర్ వేగం పెంచాడు. పోలీసులు కంటైనర్‌ను వెంబడించారు. పోలీసులపైకి దొంగలు కాల్పులు జరిపారు. పోలీసులు సైతం ఎదురు కాల్పులకు దిగారు. ఒక దొంగ మృతిచెందాడు. కొందరు దొంగలతోపాటు పోలీసులు సైతం గాయపడ్డారు. దాదాపు 12 కిలోమీటర్ల మేర పోలీసులు వెంబడించారు. ఎట్టకేలకు కంటైనర్‌ను పోలీసులు నిలువరించారు. ఆరుగురు దొంగలను పట్టుకున్నారు. కారును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నగదు రూ. 60 లక్షల వరకు ఉంటుందని పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. వీరంతా హర్యానాకు చెందిన గ్యాంగ్ అని వివరించారు. ఏటీఎంల్లో చోరీ చేసే సమయంలో ఏటీఎం అండర్ రిపేర్ అంటూ బోర్డ్ పెట్టేవారని వివరించారు. దీంతో నగదు తీసుకునేందుకు ఎవరూ ఈ ఏటీఎం వద్దకు వచ్చే వారు కాదన్నారు. గాయపడిన పోలీసులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్లు ఐజీ సెంథల్ కుమార్ చెప్పారు.

అమరుల కుటుంబాలకు రూ.2 కోట్లు

రైతుల సంక్షేమానికి పెద్ద పీట
హర్యానా ప్రజలకు కాంగ్రెస్ హామీలు

చండీగఢ్: హర్యానా అసెంబ్లీ ఎన్నికల వేళ రైతులకు పెద్దపీట వేస్తూ మేనిఫెస్టోను కాంగ్రెస్ విడుదల చేసింది. అన్నదాతల కోసం సంక్షేమ కమిటీ ఏర్పాటుకు సంకల్పించింది. అమరవీరుల కుటుంబాలకు రూ. 2కోట్ల పరిహారం ఇస్తామని వాగ్దానం చేసింది. హర్యానా మైనారిటీ కమిషన్‌ను పునరుద్ధరిస్తామని హామీనిచ్చింది. ఉపాధి/ఉద్యోగాలు సృష్టికిగాను లేబర్ ఇంటెన్సివ్ యూనిట్లను పెంపొందిస్తామని పేర్కొంది. ఎంఎస్‌పీకి చట్టబద్ధత, కులగణన, రూ. 500కు వంటగ్యాస్, 18-60ఏళ్ల మహిళలకు నెలకు రూ. 2వేలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు నెలకు రూ. 6వేల పింఛన్, రెండు లక్షల ప్రభుత్వ శాశ్వత ఉద్యోగాలు, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 25లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తామని 'ఏడు గ్యారంటీలు' ఇచ్చింది. అన్ని సామాజిక వర్గాలను సంప్రదించిన తర్వాతే మేనిఫెస్టోను రూపొందించినట్లు కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాత్ చెప్పారు. మేనిఫెస్టో అంశాలను కాంగ్రెస్ ఎమ్మెల్యే, మేనిఫెస్టో కమిటీ ఇన్‌చార్జ్ గీతా భుక్కల్ వివరించారు. అధికారంలోకి వచ్చాక సన్నకారు రైతులకు సబ్సిడీపై డీజిల్ ఇచ్చేలా డీజిల్ కార్డును జారీచేస్తామని చెప్పారు. సాగు చట్టాలపై పోరులో అమరులైన రైతుల కోసం స్మారకం, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామన్నారు. సట్లజ్, యమునా లింక్ కెనాల్ రాష్ట్రానికి జీవనరేఖ అని, దీనిపై హర్యానాకు అనుకూలంగా వెలువడిన సుప్రీంకోర్టు ఉత్తర్వుల అమలుకు కసరత్తు చేస్తామని చెప్పారు. పరివార్ పెహచాన్ పత్ర (పీపీపీ) రద్దు, 'మేరీ ఫసల్ మేరా బ్యోరా' పోర్టల్‌పై సమీక్షకు హామీనిచ్చారు. వెనుకబడిన వర్గాల క్రిమిలేయర్ పరిధిని రూ. 6లక్షల నుంచి రూ. 10లక్షలకు పెంచుతామన్నారు. మూకహత్యలు, దాడులు, పరువు హత్యల నిరోధానికి కఠిన చట్టాలు తెస్తామని, మాదకద్రవ్యాలు లేని రాష్ట్రంగా హర్యానాను తీర్చిదిద్దుతామని, క్రీడలను ప్రోత్సహించేందుకు పతకాలు సాధించిన వారికి ఉద్యోగాలిస్తామని తెలిపారు. మీవట్‌లో యూనివర్సిటీ, ప్రతి మండలం, జిల్లాలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు నెలకొల్పుతామని, గ్రామీణ ఉపాధి హామీ కింద దినసరి వేతనాన్ని రూ. 400కు పెంచుతామని, హర్యానా కుషల్ రోజ్‌గార్ నిగమ్‌ను రద్దు చేస్తామని, పేపర్ లీకేజి కేసుల విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ పోస్టుల భర్తీకి ఏడాది మొత్తం నియామక క్యాలెండర్ విడుదల చేస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టో హామీనిస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు అక్టోబరు 5న, ఓట్ల లెక్కింపు 8వ తేదీన జరుగుతాయి.

'గాంధీ'లది త్యాగ చరిత్ర

మోదీ విమర్శలపై శరద్‌పవార్ మండిపాటు

పూనె: మూడు తరాలు దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబాన్ని ... మోదీ విమర్శించడం తగదని శరద్‌పవార్ అన్నారు. హర్యానా, జమ్మూకశ్మీర్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల ర్యాలీల్లో గాంధీ కుటుంబాన్ని ప్రధాని విమర్శించారు. ఆయన విమర్శలపై ఎన్‌సీపీ నేత శరద్‌పవార్ మండిపడ్డారు. పూణె జిల్లా వడ్గావ్ షేరి అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 'ఎన్నికల ర్యాలీల్లో ప్రధాని మోదీ ద్రవ్యోల్బణం, శాంతిభద్రతలు, నిరుద్యోగంపై మాట్లాడి ఉంటే తాము ఎంతో సంతోషించేవాళ్లం. అభినందించేవాళ్లం. కానీ ఆయన ఇవేవీ మాట్లాడకుండా... జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, ఇప్పటి రాహుల్‌గాంధీల గురించి మాట్లాడారు. నెహ్రూ 14 ఏళ్లు జైల్లో ఉన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ దేశం కోసం ప్రాణత్యాగం చేశారు. ఇందిరాగాంధీ బంగ్లాదేశ్ ఏర్పాటు చేసి పాకిస్తాన్‌కు గుణపాఠం చెప్పారు. దేశాన్ని ఆధునీకరణవైపు నడిపేందుకు రాజీవ్‌గాంధీ ఎన్నో సంస్కరణలు చేశారని అన్నారు. కాగా, లోక్‌సభ ఎన్నికల ఫలితాల మాదిరిగానే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మార్పు కనిపిస్తోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తాము 48 సీట్లకు 31 సీట్లను గెలుచుకుంటామని పవార్ ధీమా వ్యక్తం చేశారు. మహారాష్ట్ర ప్రజలు మార్పును కోరుకుంటున్నారని అన్నారు. ఇటీవల కేంద్ర కేబినెట్ 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' ప్రతిపాదనను ఆమోదించింది. అయితే కేంద్రం చెబుతున్నట్లుగా జమ్మూకశ్మీర్, హర్యానా, మహారాష్ట్ర ఎన్నికలు ఒకేసారి నిర్వహించవచ్చు కదా... మరి విడివిడిగా ఎందుకు నిర్వహిస్తున్నట్లు అని పవార్ ప్రశ్నించారు. మోసపూరిత రాజకీయాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం బీజేపీ నేతలు చేస్తున్నారని పవార్ మండిపడ్డారు.

బాధల నుంచి విముక్తి కల్పిస్తాం

హర్యానా ప్రజలకు రాహుల్ గాంధీ భరోసా

న్యూఢిల్లీ: హర్యానాలో రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వం దశాబ్దకాలంగా ప్రజలనుభవిస్తున్న బాధలకు విముక్తి పలకబోతోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. హర్యానా రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చడానికి పార్టీ సిద్ధంగా ఉందని చెప్పారు. అక్టోబరు 5న జరిగే హర్యానా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి హర్యానా కాంగ్రెస్ రూపొందించిన వివరణాత్మక ఎన్నికల మేనిఫెస్టోను కాంగ్రెస్ విడుదల చేసిన తర్వాత రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు. పదేళ్లలో హర్యానా సౌభాగ్యం, కలలు, అధికారాన్ని బీజేపీ లాక్కుందన్నారు. అగ్నివీర్ పథకం దేశభక్తి గల యువత ఆకాంక్షలను దూరం చేసిందని, నిరుద్యోగం కుటుంబాల్లో చిరునవ్వును దూరం చేసిందని, ద్రవ్యోల్బణం మహిళల స్వావలంబనను దూరం చేసిందని రాహుల్ విమర్శించారు. నల్ల చట్టాలను తీసుకొచ్చి రైతుల హక్కులను హరించే ప్రయత్నం చేశారని, నోట్ల రద్దు, జీఎస్టీ ద్వారా లక్షలాది మంది చిరు వ్యాపారుల లాభాలను కొల్లగొట్టారన్నారు. ఎంపిక చేసుకున్న స్నేహితులకు ప్రయోజనం చేకూర్చేందుకు హర్యానా ఆత్మగౌరవాన్ని కూడా కొల్లగొట్టారని బీజేపీని ఉద్దేశించి రాహుల్ వ్యాఖ్యానించారు. 'రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వం 'దశాబ్దపు నొప్పి'ని ముగిస్తుంది. ప్రతి హర్యానా నివాసి ఆశలు, ఆకాంక్షలు, కలలను నెరవేర్చడమే మా సంకల్పం' రాహుల్ స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం కోసం కమిషన్ ఏర్పాటు, అమరులైన సైనికుల కుటుంబాలకు రూ. 2 కోట్లు ఆర్థిక సహాయం, ఉపాధి కల్పనకు కార్మిక-ఇంటెన్సివ్ యూనిట్లను ప్రోత్సహించడం, హర్యానా మైనారిటీ కమిషన్ పునరుద్ధరణ సహా అనేక హామీలను మేనిఫెస్టోలో పొందుపర్చారు. ఈ కార్యక్రమంలో హర్యానా కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ భాన్, అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు భూపిందర్ సింగ్ హుడా, రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ తదితరులు పాల్గొన్నారు. అక్టోబరు 5న హర్యానా ఎన్నికలు జరగనుండగా, అక్టోబర్ 8న ఫలితాలు వెలువడనున్నాయి.

నిరుద్యోగులు బీజేపీని ఓడిస్తారు: ఖడ్గే



న్యూఢిల్లీ: దేశంలో నిరుద్యోగం కంటే పెద్ద సమస్య మరొకటి లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే పేర్కొన్నారు. మోదీ పాలనలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయిన ప్రతి ఒక్క యువకుడు ప్రతి ఎన్నికలో బీజేపీ ఓటమిని నిర్ధారిస్తారని ప్రధాని నరేంద్ర మోదీ గుర్తుంచుకోవాలని ఖడ్గే అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) డేటాను ఉటంకిస్తూ... ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, ఈ ప్రభుత్వ డేటా యువత నిస్సహాయతను దాచలేకపోయిందని ఖడ్గే అన్నారు. 'దేశంలో నిరుద్యోగం కంటే పెద్ద సమస్య లేదు. యువత భవిష్యత్తును నాశనం చేయడంలో మోదీజీకి అతిపెద్ద బాధ్యత ఉంది. పీఎల్ఎఫ్ఎస్ తాజా డేటాను మనం నిశితంగా పరిశీలిస్తే... ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ యువత నిస్సహాయతను దాచలేకపోయినట్లు స్పష్టమవుతోంది' అని ఖడ్గే అన్నారు. 'నరేంద్ర మోదీ జీ సమాధానం చెప్పాలి. 2023-24లో యువత నిరుద్యోగం 10.2% భయానక స్థాయికి చేరుకోలేదా? ఆకర్షణీయ నినాదాలు ఇవ్వడం, ఫోటోలకు అవకాశం ఇవ్వడం కంటే యువతకు ఉద్యోగాలు కల్పించడానికి మోదీజీ ఏమి చేశారు?' అని ఖడ్గే నిలదీశారు.

రెగ్యులర్ జీతాలతో ఉద్యోగాలు చేస్తున్న మహిళల సంఖ్య ఏడేళ్లలో అత్యల్పంగా 15.9 శాతానికి చేరిందనేది నిజం కాదా? గ్రామీణ ప్రాంతాల్లో వేతనరహిత పనిలో నిమగ్నమై ఉన్న మహిళల సంఖ్య 51.9% (2017-18) నుండి 67.4% (2023-24)కి పెరగలేదా? అని ప్రశ్నించారు. తయారీరంగం గురించి మోదీ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రచారం చేస్తోంది కానీ గత ఏడేళ్లలో తయారీరంగంలో ఉపాధిని పెంచలేదని ఖడ్గే పేర్కొన్నారు. 2017-18లో 15.85 శాతంగా ఉన్న ఈ సంఖ్య 2023-24లో కేవలం 11.4 శాతానికి ఎలా పడిపోయిందని ఆయన ప్రశ్నించారు.

పూర్తి మెజారిటీతో గెలుస్తాం

కశ్మీర్ ఎన్నికల ప్రచారంలో మోదీ

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రతిపక్షాలపై ప్రధాని నరేంద్రమోదీ ఆరోపణలు గుప్పించారు. కుటుంబ పార్టీలు కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీతో జమ్మూకశ్మీర్ ప్రజలు విసిగిపోయారని ప్రధాని విమర్శించారు. అవినీతి, ఉద్యోగాల్లో వివక్షను ఈ ప్రాంత ప్రజలు కోరుకోవడం లేదన్నారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం, రక్తపాతానికి దూరంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నారని చెప్పారు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన జవాన్ల విలువ కాంగ్రెస్‌కు తెలియదని ఆరోపణలు చేశారు. 'కాంగ్రెస్ హయాంలో సరిహద్దుల్లో కాల్పులు జరిగినప్పుడల్లా ఆ పార్టీ తెల్ల జెండా ఎగురవేసింది. కానీ, బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత... ఉగ్రవాదులపై భారత్ ఎదురుకాల్పులకు దిగింది. 2016 సెప్టెంబరు 28 రాత్రి మెరుపుదాడి జరిగింది.

శత్రువుల భూభాగంలోకి వెళ్లి దాడి చేయగలిగిన నవ భారత్‌ను ప్రపంచమంతా చూసింది. దేశ రక్షణ కోసం జవాన్లు చేసిన త్యాగం విలువ కాంగ్రెస్‌కు తెలియదు. వారిని ఎన్నడూ గౌరవించలేదు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ సైనికులకు మాయమాటలు చెప్పింది. 'వన్ ర్యాంక్- వన్ పెన్షన్' ఇస్తామంటూ మోసం చేసింది' అని ఆరోపించారు. జమ్మూకశ్మీర్‌లోని ఏడు జిల్లాల పరిధిలో తొలిదశ కింద 24 శాసనసభ నియోజకవర్గాలకు ఇటీవల జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 61 శాతం పోలింగ్ నమోదవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అభినందనలు తెలియజేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 'ఈ విజయదశమి మనందరికీ ఎంతో ప్రత్యేకం. జమ్మూకశ్మీర్‌లో తొలిసారిగా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు అవుతుంది. పూర్తి మెజారిటీతో అధికారంలోకి వస్తుంది' అని చెప్పుకొచ్చారు.

ఎండీసీ ఎన్నికల్లో రాజ్యాంగ ఉల్లంఘన

సుప్రీంకోర్టుకు వెళ్తాం: సీఎం ఆతిశీ

న్యూఢిల్లీ: దిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న స్టాండింగ్ కమిటీ స్థానానికి శుక్రవారం ఓటింగ్ జరిగింది. ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ ఎన్నికల్లో పాల్గొనలేదు. అయితే, ఎండీసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికను ఆప్ రాజ్యాంగ, చట్ట విరుద్ధమని ఆమ్ ఆద్మీ పార్టీ పేర్కొంది. ఎన్నిక అక్రమ పద్ధతిలో జరిగిందని, ఎన్నికల్లో లెఫ్టినెంట్ గవర్నర్, బీజేపీ, వారి అధికారులు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఉల్లంఘించారని ముఖ్యమంత్రి ఆతాశీ విమర్శించారు. దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. 18వ ఎండీసీ సభ్యుడి కోసం శుక్రవారం ఎన్నిక జరగ్గా... ఆమ్ ఆద్మీ పార్టీ ఎన్నికల్లో పాల్గొనలేదు. బీజేపీ కౌన్సిలర్లు మాత్రమే పాల్గొన్నారు. దాంతో అధికారులు బీజేపీ అభ్యర్థి విజయం సాధించినట్లు ప్రకటించారు. ఈ ఎన్నికలపై సీఎం ఆతిశీ మాట్లాడుతూ రాజ్యాంగం, రాజ్యాంగం ద్వారా రూపొందించిన చట్టాలపై మన దేశం నడుస్తుందన్నారు. పార్లమెంట్ ఓ చట్టాన్ని ఆమోదించిందన్నారు. కార్పొరేషన్ సమావేశంలో దాని తేదీ, సమయం, స్థలాన్ని మేయర్ మాత్రమే నిర్ణయిస్తారని, కార్పొరేషన్ సమావేశానికి మేయర్ మాత్రమే అధ్యక్షత వహిస్తారన్నారు. ప్రజాస్వామ్య ఉల్లంఘన, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఉల్లంఘించినా బీజేపీ పట్టించుకోదని, అధికారాలు లేకపోయినా లెఫ్టినెంట్ గవర్నర్ ఉత్తర్వులు ఇస్తారని, కమిషనర్ ఆదేశాలు పాటించి కార్పొరేషన్ సమావేశాన్ని ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహిస్తారని ఆతిశీ విమర్శించారు. ఎన్నికైన మేయర్ స్థానంలో ఐఏఎస్ అధికారిని అధ్యక్షుడిగా చేస్తుందన్నారు. వివాదాల మధ్య జరిగిన ఎన్నికల్లో బీజేపీకి చెందిన సుందర్ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు.

'రామ్ రామ్' పలకరింపుపై యోగి గొప్పలు

ఫరీదాబాద్: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హర్యానాలోని ఫరీదాబాద్‌లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇటీవల తాను ఎన్నికల ప్రచారం కోసం జమ్మూకశ్మీర్‌లో వెళ్లినప్పుడు ఎదురైన అనుభవాన్ని చెప్పారు. ఒక ముస్లిం మతపెద్ద తనకు ఎదురుపడి 'రామ్ రామ్' అంటూ పలకరించారని, జమ్మూకశ్మీర్‌లో 370వ అధికరణ రద్దు తర్వాత అక్కడ వచ్చిన మార్పునకు అదొక ఉదాహరణ అని యోగి చెప్పారు. 'అసెంబ్లీ ఎన్నికల కోసం రెండ్రోజులుగా జమ్మూకశ్మీర్‌లో ఉన్నాను. అక్కడ వర్షం కురుస్తుండటంతో నేరుగా నేను విమానాశ్రయంలోకి వెళ్లాను. ఒక వ్యక్తి తనను పలకరిస్తూ 'యోగి సాహెబ్ రామ్ రామ్' అంటూ అభివాదం చేశారు. ఆయన ఒక మౌల్వి అని ఆ తర్వాత తెలిసింది. ఒక మౌల్వి నోటి నుంచి 'రామ్ రామ్' అని రావడం చూసి నేను చాలా ఆశ్చర్యపోయాను' అని ఆదిత్యనాథ్ చెప్పుకొచ్చారు. 370వ అధికరణ రద్దు ప్రభావం ఇదని, భారతదేశ సార్వభౌమాధికారాన్ని సవాలు చేసిన వ్యక్తులు ఇప్పుడు 'రామ్ రామ్' అంటున్నారని యోగి చెప్పారు. పటిష్ఠ భారతదేశం, పటిష్ఠ బీజేపీతో ఒకనాటికి దేశంలోని వీధులన్నీ హరే రామ హరే కృష్ణ సంకీర్తనలతో మారుమోగుతాయని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో తన నాయకత్వంలో ఏడున్నరేళ్లుగా ఎలాంటి మత ఘర్షణలు చోటుచేసుకోలేదని యోగి గొప్పగా చెప్పుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఏవైనా ఘర్షణలు జరిగినట్టు మీరు విన్నారా అని ఆయన సభికులను ప్రశ్నించారు. తాము అధికారంలోకి రాకముందు ప్రతి రెండు, మూడు రోజులకు ఒకసారి అల్లర్లు జరిగేవని యోగి అన్నారు. కాగా, 90 మంది సభ్యులున్న హర్యానా అసెంబ్లీకి అక్టోబర్ 5న పోలింగ్ జరగనుంది. ఫలితాలు అక్టోబర్ 8న వెలువడతాయి. తొలుత అక్టోబర్ 1న పోలింగ్ తేదీని ఎన్నికల కమిషన్ ప్రకటించినప్పటికీ వివిధ పార్టీల విజ్ఞప్తి మేరకు 5వ తేదీకి పోలింగ్‌ను వాయిదా వేసింది. హర్యానాతో పాటు జమ్మూకశ్మీర్ ఎన్నికల ఫలితాల తేదీని అక్టోబర్ 8కి వాయిదా వేసింది.

ఆరోపణలు రుజువైతే మరణశిక్షే

- ఆర్జీకర్ ఘటనలో నిందితుడు సందీప్ ఘోష్‌కు షాకిచ్చిన కోర్టు
- బెయిల్ తిరస్కృతి...రెండు రోజుల సీబీఐ కస్టడీ

కోల్‌కతా: ఆర్జీ కర్ వైద్యకళాశాల ఆస్పత్రిలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనలో ప్రమేయంపై తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న కళాశాల మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్‌కు సీబీఐ ప్రత్యేక కోర్టు భారీ షాకిచ్చింది. బెయిల్ నిరాకరించడంతో పాటు నేరం గనుక రుజువైతే మరణశిక్ష తప్పదని స్పష్టం చేసింది. గత ఆగస్టు 9వ తేదీన ఆర్జీకర్ ఆస్పత్రి సెమినార్ హాల్‌లో యువ వైద్యురాలిపై అత్యాచారం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఆధారాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించారని సందీప్ ఘోష్‌పై ఆరోపణలు ఉన్నాయి. అలాగే ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో జాప్యం చేశారని తలా పోలీస్ స్టేషన్ ఇన్‌ఛార్జి అభిజిత్ మోండాల్‌పై కూడా సీబీఐ అభియోగాలు నమోదు చేసింది. ఘటన వెలుగుచూసిన అనంతరం ఇద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూనే ఉన్నారని, ఈ కేసులో ఎలా ముందుకెళ్లాలో మండల్‌కు సందీప్ సూచనలు చేసినట్లు కోర్టులో సీబీఐ వెల్లడించింది. ఇద్దరూ కలిసి నేరాన్ని తక్కువ చేసి చూపడం, కప్పి పుచ్చేందుకు యత్నించడం వంటివి చేశారని చెబుతూ అరెస్ట్ చేసింది. ఈ ఇద్దరూ బెయిల్ కోసం సీబీఐ ప్రత్యేక న్యాయస్థానాన్ని(సీల్దా కోర్టు కాంప్లెక్స్) ఆశ్రయించారు. కేసులో తన క్లయింట్ ఎలాంటి నేరానికి పాల్పడలేదని... తప్పుడు ఉద్దేశంతో ఈ కేసులో ఇరికించారని ఘోష్ తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. అయితే కోర్టు బెయిల్ అభ్యర్థనను తిరస్కరించింది. 'సందీప్ ఘోష్‌పై ఉన్న నేరారోపణ తీవ్రమైంది. ఈ కేసులో ఆయన్ని బెయిల్‌పై విడుదల చేయడం న్యాయపరంగా వీలు కాదు. ఒకవేళ ఆయనపై ఆరోపణ రుజువైతే గనుక.. అత్యంత అరుదైన కేసుగా భావించి మరణశిక్ష విధించాల్సి వస్తుంది' అని అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఎస్ డే వ్యాఖ్యానించారు. అలాగే.. అభిజిత్ మోండాల్ బెయిల్ పిటిషన్‌ను సైతం కోర్టు తిరస్కరించింది. ఇక ఈ కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ... నిందితుల కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరింది. దీంతో సెప్టెంబర్ 30వ తేదీ వరకు కస్టడీకి అనుమతించింది కోర్టు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ కేసులో ఆర్జీ కర్ వైద్యకళాశాల మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ అరెస్టయ్యాక మరిన్ని విషయాలు వెలుగు చూశాయి. ఘోష్ అవినీతి వ్యవహారం బయటపడటంతో పాటు వైద్య కళాశాలలో ఆర్థిక అవకతవకలకు పాల్పడిన కేసులో సీబీఐ ఆయనను అదుపులోకి తీసుకుంది. మరోపక్క, ఘోష్... పాలిగ్రాఫ్ పరీక్ష, లేయర్డ్ వాయిస్ అనాలసిస్‌లో కీలక ప్రశ్నలకు మోసపూరిత సమాధానాలు ఇచ్చినట్లు తేలింది. ఆయన మెడికల్ రిజిస్ట్రేషన్ రద్దయింది.

జాషువా రచనలు సమాజానికి దోహదం

జయంతి సభలో వక్తల ఉద్ఘాటన

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : సమాజాభివృద్ధికి, సామాజిక సమస్యల పరిష్కారానికి జాషువా రచనలు దోహద పడతాయని వక్తలు ఉద్ఘాటించారు. నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 129వ జయంతి సభ శనివారం విజయవాడ గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో అభ్యుదయ రచయితల సంఘం, ఏఐటీయూసీ అధ్వర్యంలో జరిగింది. ఈ సభకు అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ... సంఘ సంస్కర్త గుర్రం జాషువ రచనలు నేటి తరానికి దిక్సూచి వంటివన్నారు. అణగారిన జాతులను తన కలంతో సంఘటిత పర్చిన యోధుడు జాషువా అని కొనియాడారు. ప్రజల సమస్యలను పద్యాలుగా వివరించిన వ్యక్తి గుర్రం జాషువ అని.. నాటి, నేటి తరం ఆయన మార్గంలో పయనించటం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. ఈ సభలో వక్తగా పాల్గొన్న ప్రముఖ రచయిత డాక్టర్ బీవీ పూర్ణచంద్ మాట్లాడుతూ... జాషువ రచనలన్నీ ముఖ్యమైనవేనని, ఒక్కో సందర్భంలో ఒక్కో విధంగా ఆయన రచనలు వాస్తవికతకు అద్దం పడతాయన్నారు. అణగారిన జాతులను తన కలంతో సంఘటిత పర్చిన యోధుడు జాషువా అని కొనియాడారు. కుల, మతాలు సమాజాభివృద్ధికి గొడ్డలి పెట్టువంటివని... వాటిని విడనాడాలని జాతీయ స్థాయిలో ఎలుగెత్తి చాటిన కవి జాషువా అని అన్నారు. 1080 దశం తరువాత ఆయన రచించిన గబ్బిళం కావ్యం నేడు సమాజంలో సాంఘీక పరిస్థితులకు అద్దం పడుతుందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ... బతికుండగా నిమ్న వర్గాలను పట్టించుకోని పాలకులు... పోయిన తరువాత వారిని ఆకాశానికి ఎత్తటం నేటి సమాజంలో పరిపాటిగా మారిందన్నారు. సమసమాజ స్థాపనకు, సమాజం సరైన మార్గంలో పయనించేందుకు సాహిత్యానికి, కలానికి చాలా ప్రాధాన్యత ఉందన్న గుర్రం జాషువా గారి రచనలు సమాజ మార్పుకు దోహదం చేస్తాయన్నారు. ఆయన సాహిత్యం నేడు అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలకు పరిష్కారం, నవ సమాజాభివృద్ధికి దోహద పడతాయనటంలో అతిశయోక్తిలేదన్నారు. వామపక్ష భావజాలం ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తుందన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ సుశీలమ్మ మాట్లాడుతూ స్త్రీల పట్ల ఆయన రచనల్లో ఎంతో ఉదారత ఉంటుందన్నారు. పల్లెల్లో గేదెల కాపరులు సైతం ఆయన రచనలను సులువుగా అర్థం చేసుకునే స్థాయిలో ఉండేవని గుర్తు చేశారు.కవిత్వం, వ్యక్తిత్వం ఆయన్ను ఉన్నత స్థానానికి తీసుకువెళ్లాయన్నారు. ఆయన 70ఏళ్ల జీవితంలో 50 ఏళ్లు సాహిత్య జీవితాన్నే గడిపారన్నారు. స్త్రీ ఏ వర్గంలో పుట్టినప్పటికీ సమాజంలో సమాన ప్రాధాన్యత ఉండటం లేదని ఆయన రచనల ద్వారా స్పష్టం చేశారని గుర్తు చేశారు. డా.గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ జాతిని కులాల వారీగా పంచితే ఆ సమాజంలో ఐకమత్యం పోతుందని జాషువ తన రచనల్లో స్పష్టం చేశారన్నారు. వెయ్యేళ్ల సాహిత్యంలో ప్రధానంగా ఓ 20 రచనలు తీసుకుంటే... అందులో జాషువా రచించిన గబ్బిళం రచన ఉండటం ఆయన రచనల ప్రాధాన్యతను తెలియజేస్తుందన్నారు. దురాచారాలకు వ్యతిరేకంగా అయన అనేక రచనలు చేసి సమాజానికి దిక్సూచిలా నిలిచారన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సభలో అరసం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి పరుచూరి అజయ్‌కుమార్ అతిధులకు స్వాగతం పలకగా... ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పీ చంద్రనాయక్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్ర నాథ్, రాష్ట్ర ఉపప్రధానకార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య, ఇస్కఫ్ రాష్ట్ర నాయకులు కె.రాజశేఖర్, అరసం జిల్లా నాయకులు పరుచూరి అజయ్‌కుమార్, మోతుకూరి అరుణ్‌కుమార్, సీతారామయ్య, కవులు, రచయితలు, సాహితీ ప్రియులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

నేడు, రేపు చండీగఢ్‌లో ఏఐకేఎస్ జాతీయ కార్యవర్గ సమావేశాలు

విశాలాంధ్ర-విజయవాడ: అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ కార్యవర్గ సమావేశాలు ఈనెల 29, 30 తేదీల్లో పంజాబ్ రాజధాని చండీగఢ్‌లో జరగనున్నాయి. ఈ మేరకు ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకటయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో పాటు భవిష్యత్ కార్యక్రమాలపై సమావేశాల్లో చర్చిస్తామన్నారు. 2025 మార్చి చివరి వారంలో జాతీయ మహాసభలు తమిళనాడులో జరగనున్నట్లు వెల్లడించారు. జాతీయ, వివిధ రాష్ట్రాల్లో మహాసభల నిర్వహణపైనా చండీగఢ్ సమావేశాల్లో చర్చించనున్నట్లు తెలిపారు. కార్యవర్గ సమావేశాల్లో ఏఐకేఎస్ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్, సత్యన్ ముఖేరి, కేడీసింగ్, వీఎస్ మాశలమణి, బల్‌దేవ్‌సింగ్, చత్తార్‌సింగ్, కేవీవీ ప్రసాద్ పాల్గొంటారని, వారంతా చండీగఢ్ చేరుకున్నారని రావుల వెంకయ్య పేర్కొన్నారు.

ప్రముఖ రచయిత్రి విజయభారతి కన్నుమూత

విశాలాంధ్ర-హైదరాబాద్: ప్రముఖ రచయిత్రి బి.విజయభారతి కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతూ శనివారం ఉదయం తుదిశ్వాస విడిచారు. నిన్న తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆమెను కుటుంబ సభ్యులు సనత్‌నగర్‌లోని రెనోవా ఆస్పత్రికి తరలించారు. విజయభారతి మృతితో ఆమె కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమె మృతిపట్ల రచయితలు, మేధావులు, నాయకులు సంతాపం ప్రకటించారు. దళిత సాహిత్యానికి తీరని లోటు అని పేర్కొన్నారు. 1968లో ప్రముఖ హేతువాది, దళిత నాయకుడు, న్యాయవాది బొజ్జా తారకంను విజయభారతి వివాహం చేసుకున్నారు. బొజ్జా తారకం, విజయభారతి దంపతుల కుమారుడు రాహుల్ బొజ్జా. ఆయన ప్రస్తుతం తెలంగాణ కేడర్‌లో ఐఏఎస్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజోలులో 1941లో ప్రముఖ రచయిత బోయి భీమన్న, నాగరత్నమ్మ దంపతులకు విజయభారతి జన్మించారు. కోఠి ఉమెన్స్ కాలేజీ నుంచి పీజీ పూర్తి చేశారు. దక్షిణ దేశీయాంధ్ర వ్యాయం-సాంఘిక పరిస్థితులు అను అంశంపై పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగులో డాక్టరేట్ పొందిన రెండో మహిళ విజయభారతి. తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా విజయభారతి తనదైన ముద్ర వేశారు.

రేవంత్‌రెడ్డి, కేసీఆర్ సంతాపం

రచయిత్రి బి.విజయభారతి మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం తెలిపారు. తెలుగు అకాడమీ డిప్యూటీ డైరెక్టర్‌గా సేవలు అందించడంతో పాటు ఆమె ప్రాచీన సాహిత్య కోశం, ఆధునిక సాహిత్య కోశం వెలువరించారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. సాహితీ రంగానికి ఆమె చేసిన సేవలు అపారమైనవని ముఖ్యమంత్రి తెలిపారు. రాహుల్ బొజ్జాతో పాటు వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సానుభూతి తెలియజేశారు. అంబేద్కరిస్ట్ విజయభారతి మరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. సాహిత్య, సామాజిక అధ్యయనశీలిగా, విశ్లేషకులుగా విజయభారతి చేసిన కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచనలు, ప్రసంగాల సంపుటాలకు సంపాదకురాలిగా, మహాత్మా జోతిరావు పూలే జీవిత చరిత్రను తెలుగు సమాజానికి మొట్టమొదటి సారి అందించిన రచయిత్రిగా, ఆమె కృషి అమోఘమన్నారు. శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సామాజిక వివక్షపై కలం దూసిన జాషువా

- మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్
- డీహెచ్‌పీఎస్ అధ్వర్యంలో ఘన నివాళులు

విశాలాంధ్ర-విజయవాడ: సామాజిక వివక్షతపై కలమనే కత్తి దూసి అసమానతలను దునుమాడిన ఆధునిక కవి, విప్లవకారుడు గుర్రం జాషువా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. జాషువా 129వ జయంతిని పురస్కరించుకుని దళిత హక్కుల పోరాటం సమితి (డీహెచ్‌పీఎస్) అధ్వర్యంలో సమితి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్ప అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద జాషువా విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ నాటి సమాజంలో ఆర్థిక, సామాజిక వివక్షకు గురైన జాషువా... తన సాహిత్యంతో వివక్షను దునుమాడి నిమ్న జాతుల్లో చైతన్యం తీసుకువచ్చారని కొనియాడారు. కవి సామ్రాట్ జాషువా నవయుగ వైతాళికుడన్నారు. జాషువా అనేక ఖండకావ్యాలు రచించారని, ఆయన రాసిన 'గబ్బిలం' సాహిత్య ప్రస్థానంలో ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. దేవాలయాల్లో గబ్బిలాలకు మాత్రమే ప్రవేశం, అవకాశం ఉండే రోజుల్లో అట్టడుగు వర్గాల బాధలను, ఆవేదనలను దేవుడికి చేరవేయమని డిక్లరేషన్ లేని గబ్బిలం ద్వారా సందేశం పంపిస్తూ రాసిన కావ్యంలో సమాజ స్థితిగతులను బట్టబయలు చేశారన్నారు. గబ్బిలం, ఫిరదౌసి వంటి రచనలతో పదునైన భావజాలంతో అన్యాయాలను చీల్చి చెండారని కొనియాడారు. ప్రతిమల పెండ్లి చేయుటకు వందలు, వేలు వ్యయం చేస్తారుగానీ... దు:ఖితమతులైన వారి భిక్షపాత్రలో మెతుకు విదల్చరని మూఢవిశ్వాసాలను కడిగిపారేశారన్నారు. కర్మ సిద్ధాంతం, కుల వివక్ష, అంటరానితనం, పాపపుణ్యాల ఫలితమే దరిద్రులుగా పుట్టటం, ధనవంతులుగా మారటం సనాతన ధర్మం మూల సూత్రాలని వేలాది పుస్తకాలు చదివిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కి తెలియకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. కొందరు కుల, మతాలు అడ్డుపెట్టుకుని సమాజంలోకి మతభావాన్ని తీసుకువస్తున్నారని ధ్వజమెత్తారు. సనాతన ధర్మం అంటే కులవ్యవస్థను తిరిగి తీసుకురావటమే అన్నారు. సమాజంలో అగ్రవర్ణాలు, పెత్తందార్లు చేస్తున్న అన్యాయాలను గుర్తించాలన్నారు. ఛాందసవాద తిరోగమన భావాలపై తిరుగులేని పోరాటం చేసిన జాషువాను నేటితరం అనుసరించాలని ఉద్బోధించారు. సనాతన ధర్మం పేరుతో సమాజంలో కుల వ్యవస్థను పున:నిర్మించాలని ప్రయత్నాలు జరుగుతున్న వేళ కుల, మత భేదం లేని సమసమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర నేత కాగితాల రాజశేఖర్, డీహెచ్‌పీఎస్ విజయవాడ నగర అధ్యక్షుడు సంగుల పేరయ్య, నాయకులు డి.బాలకోటేశ్వరరావు, ప్రత్తిపాటి రాజు, ఆర్.ప్రభుదాసు, కూరాకుల స్టాలిన్, డి.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలకు కమ్యూనిస్టులు వ్యతిరేకం

జంగాల అజయ్‌కుమార్

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: జమిలి ఎన్నికలకు కమ్యూనిస్టులు వ్యతిరేకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. సీపీఐ నగర సమితి సభ్యుల సమావేశం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో శనివారం సాయంత్రం జరిగింది. నగర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ విజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన జంగాల మాట్లాడుతూ జమిలి ఎన్నికలు... రాజకీయ పార్టీలు, భారత రాజ్యాంగానికి గొడ్డలిపెట్టు వంటిదని అన్నారు." జమిలి ఎన్నికలకు బీజేపీ క్యాబినెట్‌లో ఆమోదం తెలియజేయడం దుర్మార్గమని అన్నారు. దేశంలో బీజేపీ ఒక్కటే పాలన చేయాలనే దురుద్దేశ్యంతో వారు ఆమోదం తెలిపారని విమర్శించారు. మోదీ అధికారం చేపట్టిన తరువాత లక్షల కోట్లు అప్పులు చేసి దేశాన్ని అధ:పాతాళానికి తొక్కేశారని మండిపడ్డారు. పేదరికం పెరిగి ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయిందన్నారు. దేశ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెడుతుందని ఆరోపించారు. దేశంలో హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ మనువాదాన్ని అమలు చేసే కుట్రకు బీజేపీ పూనుకుందని విమర్శించారు. దీనిని నిలువరించాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందని అన్నారు. తిరుమల లడ్డూ వివాదంపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పాలకపక్షాల ద్వంద‌నీతిని, దుర్మార్గాన్ని ఎండగట్టి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ నగర సమగ్రాభివృద్ధికి సీపీఐ కృషి చేస్తుందని స్పష్టం చేశారు. పార్టీ శత జయంతి ఉత్సవాలను నగరంలో ఘనంగా నిర్వహించేలా పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

ఇసుకపై జీఎస్టీ ఎత్తివేయాలి

సంక్షేమ బోర్డు ఏర్పాటుకు 'భవన నిర్మాణ' సంఘం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్.వెంకటసుబ్బయ్య, అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. మీడియాతో శనివారం వారు మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్... నాడు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ఇసుక ఉచితంగా ఇస్తామని చెప్పారన్నారు. అయితే గత ప్రభుత్వంలో ఉన్న ఇసుక రేటుకు ఇప్పటి ప్రభుత్వంలో ఉన్న ఇసుక రేటుకు పెద్ద తేడా ఏమి లేదన్నారు. పైగా ఉచితంగా ఇస్తామంటున్న ఇసుకకు జీఎస్టీ కూడా విధిస్తున్నారన్నారు. అంతే కాకుండా లారీ యజమానులు ... క్వారీలలో ఎన్ని రోజులు ఆగి ఉంటే అన్ని రోజులకు వెయిటింగ్ చార్జీ, డ్రైవర్ జీతంతో పాటు మామూళ్లు కలిపి చెల్లించవలసి వస్తున్నందున గృహ యజమానికి ఇసుక భారమై నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయని, దీని వల్ల 32 రకాల పనివారలు అర్ధాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు నిరాశే మిగిలిందన్నారు. ఇప్పటికైనా ఇసుకపై జీఎస్టీని ఎత్తివేసి, ఇసుక అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి పెండింగ్ లో ఉన్న 42 వేల క్లెయిములకు నిధులు మంజూరు చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా డిప్యూటీ కార్యదర్శి రావుల అంజిబాబు, విజయవాడ టౌన్ డిప్యూటీ కార్యదర్శి చల్లా వెంకటరమణ, జాయింట్ సెక్రటరీ సీహెచ్ రామస్వామి, ట్రెజరర్ జె.శ్రీనివాసరావు, ప్రభుదాస్ పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ రక్షణకు పోరాడదాం

విద్యార్థులు, యువతకు ఈశ్వరయ్య పిలుపు

విశాలాంధ్ర-రాజంపేట: దేశంలో, రాష్ట్రంలో పాలకులు విద్యావ్యవస్థను పూర్తిగా కార్పొరేట్ మయం చేస్తున్నారని సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. శనివారం రాజంపేటలో ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా ద్వితీయ మహాసభల ప్రారంభం సందర్భంగా జరిగిన బహిరంగ సభలో గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ... దేశంలో ప్రైవేటీకరణ దిశగా విద్యా వ్యవస్థ నడుస్తోందన్నారు. కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 10 శాతం నిధులు కేటాయించలేదన్నారు. చదువు ప్రైవేటుమయం, డబ్బుమయం అయిపోయిందని... పేద, సామాన్య వర్గాలకు అందుబాటులో లేకుండా పోతోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వందరోజులు గడిచినా... ఒక కుటుంబంలో ఎంత మంది చదువుకుంటుంటే... అంత మందికి రూ.15వేలు ఇస్తామన్న ఎన్నికల హామీని సీఎం చంద్రబాబు ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. పైగా వికసిత ఆంధ్రప్రదేశ్ బాకా ఊదుతున్నారని...ఇలాంటి విజన్లు గతంలో ఎన్నో చెప్పారని ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా రాష్ట్రం అప్పుల మయంగా ఉందంటున్నారన్నారు. దేశంలో అమ్మాయిలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. చట్టాలు చేస్తున్నామంటున్నారే గానీ వాటిని పకడ్బందీగా అమలు చేయడం లేదన్నారు. దేశంలోకి విదేశీ యూనివర్సిటీలకు రెడ్ కార్పెట్ పరుస్తూ...స్వదేశీ యూనివర్సిటీలకు కనీస మౌలికవసతులు కల్పించకుండా...అధ్యాపకులను నియమించకుండా పనికిరాకుండా చేస్తున్నారని మండిపడ్డారు. నేడు భగత్ సింగ్ 117వ జయంతి రోజున ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు జరగడం సంతోషకరమన్నారు. భగత్ సింగ్ ఆలోచనలు, ఆచరణలు విద్యార్థులు అలవర్చుకోవాలని, విద్యా వ్యవస్థను కాపాడుకోవడానికి, మెరుగుపరచుకోవడానికి పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. బహిరంగ సభకు ముందు రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయం నుండి వేలాదిమంది విద్యార్థులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం, పాత బస్టాండ్ మీదుగా పొట్టి శ్రీరాములు విగ్రహం నుండి బాలికల ఉన్నత పాఠశాల వరకు విద్యార్థి ప్రదర్శన సాగింది. విద్యారంగాన్ని కాపాడాలని, విద్యారంగానికి నిధులు కేటాయించాలని విద్యార్థులు నినదించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఈశ్వరయ్య , ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం రాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సహాయ కార్యదర్శి పి మహేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాధవ్, కోటేశ్వరరావు, ఏఐటీయుసి జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు ఎం శివరామకృష్ణదేవరా, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి సికిందర్, టి.కృష్ణ చైతన్య, రాజ శేఖర్, హరి, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సరోజినమ్మ ఏఐ ఎస్ ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ బాలసుబ్రమణ్యం, వినయ్ కమలాకర్, ఏఐఎస్ఎఫ్ మహిళా నాయకులు గంగా, భవిత, సుఫియా, తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

కల్తీని నిరూపించగలరా

చంద్రబాబుకు బొత్స సవాల్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: తిరుమల లడ్డూ తయారీలో కల్తీ జరుగుతోందని నిరూపించగలరా అని ముఖ్యమంత్రి చంద్రబాబుకు శాసన మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ సవాల్ చేశారు. ఈ వ్యవహారంలో థర్డ్ పార్టీతో విచారణ చేయించే ధైర్యముందా అని ప్రశ్నించారు. 100 రోజుల పాలన వైఫల్యాల నుంచి దృష్టి మరల్చేందుకు లడ్డూ వివాదానికి తెరతీశారని, అది బెడిసి కొట్టడంతో వైసీపీ అధినేత జగన్ తిరుపతి పర్యటనపై రాద్ధాంతం చేశారని బొత్స ఆరోపించారు. 'టీటీడీలో కల్తీ నెయ్యి వాడారు కానీ ఎక్కడ - ఎలా జరిగిందో తెలియదు' అని మాట్లాడడం చూస్తుంటే చంద్రబాబుపై జాలి కలుగుతోందన్నారు. చెప్పిన అబద్ధాన్ని నిజం చేయడానికి, వెంకటేశ్వర స్వామినే పణంగా పెట్టాలనుకున్నారని విమర్శించారు. బొత్స సత్యనారాయణ శనివారం విశాఖలో మీడియా ప్రతినిధులతో మాట్లా డుతూ ఆరోపణలు చేయడం కాదు ఆధారాలతో రుజువు చేయగలరా అని చంద్రబాబును ప్రశ్నించారు. కేంద్రం, సుప్రీంకోర్టు, హైకోర్టుకు లేఖలు రాయాలన్న ఆయనకు థర్డ్ పార్టీ విచారణపై భయమెందుకని ఎద్దేవా చేశారు. ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, బీజేపీ సీనియర్ నేత సుబ్రమణ్యస్వామి ఇప్పటికే సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారని బొత్స గుర్తుచేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సుప్రీంను ఆశ్రయించా లన్నారు.జగన్ తిరుపతికి వెళ్లినప్పుడు అక్కడ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా టీడీపీ, బీజేపీ కుట్ర చేశాయని ఆరోపించారు. పొరుగు రాష్ట్రాల నుంచి బీజేపీ కార్యకర్తలను పెద్ద సంఖ్యలో తిరుపతికి తరలించారని, పోలీసులు పట్టించుకోలేదని అన్నారు.

కాన్పూర్ టెస్టు... రెండో రోజు ఆట వర్షార్పణం

కాన్పూర్: భారత్-బంగ్లాదేశ్ క్రికెట్ జట్ల మధ్య కాన్పూర్ లో జరుగుతున్న రెండో టెస్టుపై వరుణుడు పంజా విసిరాడు. తొలి రోజు శుక్రవారం ఆట వర్షం కారణంగా అర్ధాంతరంగా నిలిచిపోగా... రెండో రోజు శనివారం ఆట పూర్తిగా వర్షార్పణం అయింది. కాన్పూర్ లో ఎడతెరిపిలేని వర్షం కురుస్తుండడంతో, గ్రీన్ పార్క్ స్టేడియం చిత్తడిగా మారింది. దాంతో ఆటను పూర్తిగా రద్దు చేస్తున్నట్టు మ్యాచ్ రిఫరీ ప్రకటించారు. కాగా ఈ టెస్టు మ్యాచ్ లో టాస్ గెలిచిన టీమిండియా బౌలింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్ కు దిగిన బంగ్లాదేశ్... తొలిరోజు వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 107 పరుగులు చేసింది. రెండోరోజు ఒక్క బంతి కూడా పడకుండానే ఆట రద్దయింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.